# సుమబాల

## అంతర్జాల పిల్లల మాసపత్రిక

01-02-2026 సంపుటి -1 ఫిబ్రవరి సంచిక-2 రూ50/-



# సుమబాల

**అంతర్జాల పిల్లల మాసపత్రిక**




## సుమబాల పరివారం


సంపుటి :1 ఫిబ్రవరి 2026 సంచిక:2



**సంపాదకురాలు :అవుతు శ్రీవిద్య**

**సహ సంపాదకులు :ఈ శ్రీనివాస రెడ్డి**

**ముఖచిత్రం & ఏ ఐ చిత్రాలు :మోక్షదేవ్**

**గ్రాఫిక్స్:జ్ఞానిక**


**చందా వివరాలు:**

సంవత్సర చందా రూ 500 (ఆన్లైన్ )
సంవత్సర చందా రూ 1000 (ప్రింట్ )

ప్రకటనలు , చందాలకు మరియు రచనలు ,అభిప్రాయాలు పంపవలసిన చిరునామా
sumathibalapatrika@gmail.com


ప్రచురణ

**సుమతి పబ్లికేషన్స్**
(RC NO.:538/2006 )

హౌస్ నం :26 -46 -79,వేణుగోపాల నగర్,
గుంటూరు ,ఆంధ్రప్రదేశ్




# మా విన్నపం ...






**సుమబాల.. బాలల చేతిలో సుమమాల**

చక్కని కథలతో.. ధారావాహికలతో.. అందమైన రంగురంగుల బొమ్మలతో జనవరి – 2026 సంచిక మీ ముందుకు వచ్చేసింది.

అచ్చులో కూడా అందుబాటులో వుంది మీ అభిమాన సుమబాల పత్రిక.

అప్పటి చందమామను గుర్తుకు తెచ్చేలా ఉత్తమ సంస్కారాలతో, అలనాటి చందమామకు రచనలు చేసిన అతిరథ మహారథుల సహకారంతో సుమబాల సృష్టి జరిగింది.

మీ అందరి ప్రోత్సాహ సహకారాలతో ఈనాటి బాలలకు కూడా, ఆనాటి చందమామను పోలిన సుమబాల పరిచయం చెయ్యడం సాధ్య పడుతుంది. ఈ బాలలు కూడా తమ బాల్యంలోని మధురిమలను మరువలేని జ్ఞాపకాలుగా మనలాగే మార్చుకోనివ్వండి.

ఈ సందర్భంగా గాలిబ్ పలుకులు స్ఫురణకు వస్తున్నాయి –

దేవుడితో అంటాడు – ఉందో లేదో తెలియదు నీ స్వర్గం తిరిగిచ్చేయ్ నా బాల్యం. తిరిగిచ్చేద్దాము వారికి ఆ అందమైన బాల్యాన్ని సుమబాల వారి చేతికి అందించి.

మీ ప్రియమైన చిన్నారులకు ఈ సాహితీ చందమామను కానుకగా అందివ్వండి. వారి ముఖంలోని సంతోషపు వెలుగులను మీ గుండెల్లో నింపుకోండి.





# లోపలి పేజీలలో .....


## చిన్నకధలు:

1. కృషితో నాస్తి
2.అయినా బుద్ది మారలేదు
3.టింకు పొరపాటు
4.ఎలుగు బంటి సాయం
5.దేవత వరం
6. మంచి ఎవరు చెప్పిన వినాలి
7. లివ్ ఎండ్ లేట్ లివ్
8.నిజమైన సైన్యాధికారి
9.పానకాల్ చెరువు
10. పుట్టిన రోజు పుస్తకం

## పెద్ద కధలు :

1. ఔచిత్యం
2.శ్రమ విలువ

## బాల గేయాలు:

1.బడికి పోయే బాలలం
2.మాతృభాష
3. బాలల్లాల రండి 4. ఒకటి ఒకటిఒకటి

## బొమ్మల కధలు:

అల్లాఉద్దీన్ అద్భుత దీపం
పంచతంత్రం
రాము & రోబో

## సైన్సు కధలు:

థామస్ ఆల్వా ఎడిసన్

## నీతి కధలు:

అక్బర్ బీర్బల్ కధలు
తెనాలి రామకృష్ణ కధలు
ముల్లా నసీరుద్దీన్ కధలు
నీతి చంద్రిక కధలు
భేతాళ కధలు

## ధారావాహికలు :

అభిమన్యుడు
శివాజీ

## పోటీలు:

1.బొమ్మకు కధ
2.బొమ్మలు వేసి పంపండి
3. పజిల్





## ఇంకా ...

1.రోబో సంగతులు ,2.విహారి ,3.మెదడుకు మేత 4.వేమన పద్యాలు 5. సుమతీ శతకం 6.బొమ్మలు చేద్దాం 7. రంగులు వేద్దాం 8. కనుక్కోండి చూద్దాం 9. తేడాలు కనిపెట్టండి 10.చూడాల్సిన సినిమా 11.వండర్ కిడ్స్ 12. డబ్బు విలువ నేర్పుదాం






# మానవత్వాన్ని బోధించండి

చిట్టి గువ్వలా పరిగెత్తుకొస్తున్న కావ్య ఒక్కసారిగా జారి పడిపోయింది.మోకాలు నేలని తాకగానే ఆమె కళ్లలో మెరుపులా నొప్పి చిమ్మింది.నొప్పికి మించిన భయం ఆమె ముఖంపై చీకటి నీడలా పరుచుకుంది. ఏడుస్తూ వస్తున్న కావ్య.. ఆ క్షణమే ఉపాధ్యాయుని హృదయం ఆర్థ్రతతో విలవిలలాడింది.

చిట్టి గువ్వ గుండెల్లో చిన్ని కంపనాన్ని కూడా గుర్తించే తల్లి మనసు అది.

"ఏమైంది తల్లీ..." అన్న స్వరం గాలిలో మృదువుగా పరచుకుంది.

ఆమెను జాగ్రత్తగా కూర్చోబెట్టి తాను కింద కూర్చుని...చిన్న చేతుల్లో కంపనం... కళ్ల అంచుల్లో కన్నీటి ముత్యాలు.

గాయం చూసి ఆయన కళ్లలో బాధ మెరసింది, అయినా ముఖంపై ధైర్యపు చిరునవ్వు.మందు సీసా తెరిచి, "ఇది చల్లగా ఉంటుంది... నొప్పి తగ్గిపోతుంది" అంటూ మృదువుగా మందు రాసాడు.ఆ స్పర్శలో వైద్యుడి నైపుణ్యం కాదు,తండ్రి మమకారం మాత్రమే.

"ధైర్యంగా బలంగా ఉండాలి కావ్య...

చిట్టి దెబ్బకే ఇంత భయం వద్దు"అని తలపై చేయి వేసి ఓదార్చాడు.

ఆ మాటలతో ఆమె గుండెల్లోని భయం కరిగిపోయింది, కన్నీళ్ల స్థానంలో నమ్మకం మెరసింది.


గాయం కంటే ముందే మనసులో నొప్పి మానిపోయింది. ఆ గుండె వాకిట్లో ఆ రోజు...ఒక పాఠం కాదు, మమకారం మానవత్వం బోధించబడింది.



# తమాషాలెక్కలు



## ఎక్కాల పుస్తకం




ఎవరు కనిపెట్టారో కాని చిన్నతనంలో నూటికి కనీసం 70 మంది పిల్లల్ని భయపెట్టేది ఈ పుస్తకం. ప్రతీ పుస్తకానికీ గైడ్లు వున్నాయి. కానీ దీనికి లేవు. అలా అంకెలు నేర్చుకుని ఒకటో తరగతి నించి రెండో తరగతిలోకి అడుగు పెట్టామో లేదో ఈ పుస్తకం పుస్తకాల సంచీలోకి చేరిపోయేది. అందులో పట్టుమని 10 పేజీలు లేకపోయినా లావుపాటి తెలుగు, సామాన్య శాస్త్రము, సాంఘిక శాస్త్రము లాంటి పుస్తకాల కంటే ఎక్కువ భయపెట్టేది.

అందరికీ ఒకటో ఎక్కం వచ్చేస్తుంది కదా. రెండో తరగతిలో రెండో ఎక్కంతో మొదలయ్యేవి పాట్లు. " రెండొకట్ల రెండు, రెండ్రెళ్ళు నాలుగు, రెండు మూళ్ళు ఆరు ..." అంటూ ఒక ప్రత్యేక రాగం లో మాస్టారు పాడితే మనం కూడా అనాలన్న మాట. అసలు అది బుర్రలోకి అంత సులభంగా ఎక్కదు కాబట్టే దానికి "ఎక్కము" అనే పేరు వచ్చి వుంటుంది.

ఇరవై ఇరవైలు దాకా కంఠస్థ పడితే కాని పైక్లాస్ కి పంపము అని ప్రతీ క్లాస్ లోనూ అందరికీ ఓ మాస్ వార్నింగ్ లాంటిది ఇచ్చేవారు. ప్రతీ ఎక్కం ఇరవై దాకానే ఎందుకుంటుంది, అలాగే పుస్తకంలో 20వ ఎక్కం దాకానే ఎందుకుంటుంది అన్నది అప్పట్లో అంతుచిక్కని ప్రశ్న. బహుశా మన సామర్థ్యం ఇరవైల దాకానే అని వాళ్ళు నిర్ధారించుకుని వుంటారు.

ఏ పనికైనా వాయిదా పద్ధతి వున్నట్లు రెండో క్లాస్ లో పది పదుల దాకా చాలు అనేవారు. ఒక్కో క్లాసు పెరిగే కొద్దీ పన్నెడు పన్నెడులు, పదహారు పదహార్లు, చివరికి ఇరవై ఇరవైలు దాకా సాగేది. ఎక్కాలు అప్పజెప్పే సమయంలో అందరికీ గుండెలు దడ దడ లాడేవి. అప్పటి దాకా చదివినదే అయినా మాస్టారి దగ్గరకి వచ్చే సరికి ఆరు ఆర్లు కాస్తా నలభై రెండు అయిపోయేది. ఓ రెండు బెత్తం దెబ్బలు కొట్టి మళ్ళీ మొట్టమొదటి నించీ చదివి అప్పజెప్పు అని లైన్ లో చివరికి పంపించే వారు.

నెక్స్ట్ స్టేజ్ లో కూడా ఎక్కాలు మోసం చేసేవి. అన్నీ చక్కగా అప్పచెప్తూ ఆరార్లు ముప్పై ఆరు అని చెప్పగానే మాస్టారు కోపంగా "ముప్పై ఆరా ?" అని గద్దించే సరికి సెల్ఫ్ డౌట్ వచ్చి నలభై రెండు అనడం, రెండు దెబ్బలు తినడం, మళ్ళీ లైన్ లో చివరికి వెళ్ళడం నిమిషాల్లో జరిగిపోయేది.



# తమాషాలెక్కలు



ప్రతీ క్లాస్ లోనూ ఒకరిద్దరు ఐన్స్టీన్ లు వుంటారు కదా. వాళ్ళు ఎప్పుడు కంఠస్థ పడతారో తెలిసేదికాదు గాని టక టకా అప్పజెప్పేసే వాళ్ళు. ప్రపంచాన్ని జయించినంత గర్వంతో మిగతా వాళ్ళ వైపు జాలిగా చూస్తుండేవారు. మనకి వళ్ళు మండిపోతున్నా ఏమీ చెయ్యలేని నిస్సహాయత.

సరే, రాగాన్ని ప్రాక్టీస్ చేసో, కొండగుర్తులు పెట్టుకునో, బండగా బట్టీ పట్టో మొత్తానికి ఇరవై ఇరవైల దాకా అప్పజెప్పామనుకోండి, వెంటనే మాస్టారు రూల్స్ మార్చేసేవారు. ఈసారి తలక్రిందుగా అప్పజెప్పాలి అనే వారు. అంటే ఇరవై ఇరవైలు నాలుగొందలు నించి రెండు ఒకట్లు రెండు దాకా అన్న మాట. పట్టుదలగా అదీ సాధిస్తే ఈ సారి రాండమ్ గా అడిగే వారు. పదమూడు పది హేళ్లెంత అనో, పద్దెనిమిది పదమూళ్లెంత అనో ఆడగ్గానే మనసులో రాగం పాడుకోడానికి టైమ్ పట్టేది.

స్కూల్లో మాష్టర్లే కాదు, ఇంటికొచ్చిన చుట్టాలు,పక్కాలు కూడా కనబడితే చాలు "ఎన్నో క్లాస్ రా నువ్వు ? ఎన్ని ఎక్కాలు వచ్చు ? పన్నెండు పద్నాలుగులు ఎంత ?" లాంటి ప్రశ్నలతో వేధించే వాళ్ళు. అందుకే వాళ్ళని తప్పించుకుని తిరగవలసి వచ్చేది.

ఈ ఎక్కాల పుస్తకంలో ఎక్కాలే కాక ఇంకా ఎన్నో వుండేవి. అవి చాలా ఇంటరెస్టింగ్ గా వుండేవి. ప్రతీ పేజీలోనూ క్రింద ఒక మంచి సుభాషితమో, సామెతో, వేమన పద్యమో వుండేది. అవన్నీ చక్కగా కంఠతా వచ్చేసేవి. చివరి పేజీలలో అన్ని భాషల లోనూ తెలుగు వారాల పేర్లు,నెలల పేర్లు,ఋతువులు,తిథులు,నక్షత్రాల పేర్లు వుండేవి. తెలుగుతో బాటు తమిళ, హిందీ భాషలలో కూడా వుండేవి. భాను వారము, ఇందు వారము .. చిత్తి , వయ్యాశీ.. ఇలాగ. నిజానికి తెలుగు రాష్ట్రాలలో పల్లెటూళ్ళలో వుండేవారికి దేశంలో తెలుగుతో బాటు వేరే భాషలు కూడా వుంటాయని మొదటి సారి పరిచయం చేసేది ఈ ఎక్కాల పుస్తకమే. అవి చదివేసిన విద్యార్థులు బహుభాషా కోవిదుల్లా ఫీలైపోయేవారు.

మొత్తానికి ఈ ఎక్కాల పుస్తకం ఒక మైక్రో బాలశిక్షలా పనిచేసేది. ఇది చదివినందువల్లే అప్పటి పిల్లలకి తెలుగు నెలలు, తిథుల పేర్లు తెలిసేవి. ఇప్పటి బాలలని ఎవరిని అడిగినా ఇవి సరిగ్గా చెప్పలేరని బల్ల గుద్ది మరీ చెప్పవచ్చు. కావాలంటే మీరే టెస్ట్ చేసుకోండి.

ఇంతటి ఘన చరిత్ర వున్న ఎక్కాల పుస్తకం ఈనాటి కాలిక్యులేటర్లు, అబాకస్ లు, టాబ్లెట్ ల ధాటికి తట్టుకోలేక మాయమైపోతోంది. దానితోబాటే మన పిల్లలకి తెలుగు సంస్కృతిని చిన్నతనం నించీ నేర్పే అవకాశం కూడా మృగ్యమైపోతోంది. ఐ మిస్ యు – ఎక్కాల పుస్తకం !!

ఇది చదివిన తర్వాత మీరు కూడా మిస్సవుతున్నారు కదూ? వెంటనే బజారుకెళ్ళి ఓ ఎక్కాల పుస్తకం కొనుక్కుని ఇరవై ఇరవైల దాకా తలక్రిందుగా కంఠస్థం చేయండి. మొబైల్లో పాడు రీల్స్ చూస్తూ కాలక్షేపం చేసేకంటే అదే మంచిది. మైండ్ ఆరోగ్యంగా, ఉత్సాహంగా వుంటుంది .

★★★



## కథ




# కృషితో నాస్తి దుర్భిక్షం

సత్య ప్రకాష్ స్వాతంత్ర సమరయోధుడు. సత్య ప్రతాప్ అతని కుమారుడు. కాలేజీలో డిగ్రీ చదువుతున్నాడు. అతనితోపాటు స్థానిక సర్పంచ్ కుమారుడు దుర్గాప్రసాద్ కూడా అదే కాలేజీలో చదువుతున్నాడు సత్య ప్రతాప్ అంటే దుర్గాప్రసాద్.కు అస్సలు పడదు. ఎప్పుడూ ఎవరితోనో ఒకరితో గొడవ పడుతుండే వాడు.

ఆ గొడవను కూడా సత్య ప్రతాప్ సద్దుమణి గెల ప్రయత్నించేవాడు.

ఇలా ఉండగా ఒకరోజు సత్య ప్రతాప్ తండ్రి "ఆ సర్పంచ్ గారి కొడుకుతో నీవెందుకు గొడవ పడుతున్నావు ? అతని తండ్రి నాతో నిన్ను మందలించమని హెచ్చరించాడు." అనగా నాన్న! ఆ సర్పంచ్ మాటలు లెక్కలోకి తీసుకోవద్దు. మా కాలేజీ ప్రిన్సిపల్ గారితో కూడా ఇలానే నాపై ఫిర్యాదు చేశాడు.

"అది సరే రా! నీవు ఎప్పుడు ఇలా అతనితో గొడవ పడితే ఎలా? నీ చదువు, నీ కార్యక్రమాలపై శ్రద్ధ పెడితే బాగుంటుంది కదా! అనగా నాన్న! నేను నీ కుమారుడను. నాబ చదువుకొచ్చిన డోకా ఏమి లేదు. నా కార్యక్రమాలను యధావిధిగా నా మిత్రులతో నిర్వహిస్తూనే ఉన్నా. నేను ఏం చేసినా నా ప్రజల కు మేలు జరిగేదే చేస్తాను. మీరు నిశ్చింతగా ఉండాలి నాన్నగారు.

అది వానాకాలం. ఒకరోజు రాత్రి విపరీతంగా వర్షం పడడం వల్ల నాళాలు విపరీతంగా పొర్లి పొంగినాయి.

రోడ్ల పైన చెత్తాచెదారం చేరి విపరీతంగా దుర్వాసన రావడంతో ప్రజల రాకపోకలకు అంతరాయం ఏర్పడింది. ప్రజలు వెంటనే సర్పంచ్ గారికి విన్నవించుకున్న ఫలితం లేకుండా పోయింది.

ఈ విషయం గమనించిన సత్య ప్రతాప్ తన మిత్రుల సాయంతో నాలాలలోని చెత్తాచెదారాన్ని తీసి శుభ్రం చేశాడు. రోడ్ల పైన దుర్వాసన లేకుండా బ్లీచింగ్ పౌడర్ చల్లించాడు. దాంతో రోడ్లు పరిశుభ్రమైనవి. రాకపోకులకు సౌకర్యం ఏర్పడింది.

ఈ విషయం గమనించిన స్థానిక విలేకరులు వెంటనే

# కథ

మీడియాకు ఫోటోలతో సహా సమాచారం చేరవేశారు.

ఆ సమాచారం గమనించిన రాష్ట్ర ప్రభుత్వ సమాచార శాఖ వెంటనే స్పందించి సత్య ప్రతాప్ గారిని పట్టు శాలువా తో పాటు బంగారు నంది విగ్రహ మొమెంటో ఇచ్చి 10 లక్షల నగదు పురస్కారం అందించింది.

సత్కరించబడిన కొడుకు సన్మాన కార్యక్రమ దృశ్యాలను చూసి అతని తల్లిదండ్రులు ఎంతో సంతోషించారు. అంతేకాకుండా కృషితో నాస్తి దుర్భిక్షం అన్న నానుడిని నిజం చేసి నిరూపించిన తన కొడుకుని ఆనందంతో ఆలింగనం చేసుకున్నారు.

**-గుర్రాల లక్ష్మారెడ్డి**



# పెద్ద కథ



## ఔచిత్యం!

రంజిత్ చదివే స్కూలునుంచి పిలుపు వచ్చింది. అర్జంటుగా పిల్లల తల్లిదండ్రుల సమావేశం ఏర్పాటు చేయవలసి వచ్చింది. వచ్చే శనివారం పిల్లలతో సహా ఉదయం 9.30 కల్లా సమావేశ హాల్లో ఆసీనులవ్వమని ఆ పిలుపు సారాంశం. వాస్తవంగా పిల్లల తల్లిదండ్రుల సమావేశం నెల కొక సారి జరుపుతుంటారు. ఈసారేమిటో పది రోజులు కూడ తిరగక ముందే మళ్లీ సమావేశం అంటున్నారు అనుకొంది శ్యామల.

భర్త ఆఫీసునుంచి రాగానే 'ఈ శనివారం ఎక్కడికి వెళ్లే ప్రోగ్రాం పెట్టుకోకండి' అంది శ్యామల కృష్ణమూర్తి తో.

హఠాత్తుగా శ్రీమతి అలా అనటంతో నివ్వెరపోయాడు కృష్ణమూర్తి.

'ఎందుకలా?' అన్నట్లు ఎగాదిగా చూశాడు.

'ఏంలేదు. మన రంజిత్ చదివే స్కూల్ లో అర్జంటుగా తల్లిదండ్రుల సమావేశం ఏర్పాటు చేశారు ఆ రోజు.

శనివారం తల్లిదండ్రుల సమావేశం మొదలైంది. ఎప్పటికన్నా భిన్నంగా మీ పిల్లలను బయటనే వదిలేసి, మీరు మాత్రమే లోపలికి వచ్చి కూర్చోండి', అని చెప్పింది ప్రధాన అధ్యాపకురాలు.

తల్లిదండ్రులు ముఖాలు చూసుకొన్నారు, 'ఏమిటిలా కొత్తగా?' అని.

వాళ్ల సందేహం గ్రహించిన ప్రధాన అధ్యాపకురాలు 'మీ పిల్లలకొచ్చిన భయమేమీ లేదు. మా టీచర్లు వాళ్లని ఆడిస్తారు ', అని చెప్పటంతో తల్లిదండ్రులు వారిని టీచర్లకు వదిలి లోపలికి వెళ్లి కూర్చున్నారు.

ప్రధాన అధ్యాపకురాలు ఆరంభించింది.

'మా ఆహ్వానం మన్నించి తక్కువ సమయంలో కూడ పెద్దఎత్తున తరలి వచ్చిన మీ అందరికి శుభాభినందనలు, ధన్యవాదాలు. ముఖ్యంగా మీ పిల్లల విషయంలో మీరు కొన్ని జాగ్రత్తలు తీసుకోవలసి, ఈ సమావేశం ఏర్పాటు చేశాం. మీరంతా సంపన్న కుటుంబాల వారు. మీ పిల్లలను ఏ లోటు లేకుండా పెంచాలని చూస్తారు. అది సహజం. ఆ అభిప్రాయం కొంతవరకూ సబబే. కానీ, అందులో

# పెద్ద కథ



విచక్షణ ఉండాలి. మీలో చాలామంది పూర్వాశ్రమంలో ఇంత ధనవంతులు కారు. అప్పుడు కూడ మీరడిగినవి ఎన్నో మీ తల్లిదండ్రులు మీకు కొనిపెట్టి ఉండరు. అది కేవలం డబ్బులు లేకనే కాకపోవచ్చు. అది మీకు అనవసరమని కూడ భావించి అయి ఉండవచ్చు. ఇవ్వాళ మీ దగ్గర డబ్బుందని, ఇబ్బడి ముబ్బడిగా అడిగినవన్నీ కొనిపెట్టాలని లేదు. ఇవ్వాళ మీ తల్లిదండ్రుల ఈ ఆలోచనా రీతి వలన పిల్లలు స్కూలుకు అడ్డమైనవన్నీ తెస్తున్నారు. ఇదంతా ఎక్కడో జరిగే నిర్లక్ష్యమే. రేపు ఇది కొంపముంచే పరిస్థితి తెచ్చేట్లు ఉంది. అవునా?'

ఒకసారి ఆగి సమావేశ మందిరం అంతా కలయ జూసింది. తల్లిదండ్రులంతా చాలా శ్రద్ధగా వింటున్నారు. కొందరు ఆమె ప్రశ్నకు అవునన్నట్లు తలూపారు.

ఆమె కొనసాగించింది. 'మీ పిల్లలకిప్పుడు నైతికత, నడవడిక, ప్రేమ, దయ, సానభూతి వంటివి మీరు ఆచరించి చూపవలసిన సమయం. మీరు ఇంట్లో మాట్లడే భాష, చూపించే దుందుడుకు వైఖరి, కోపతాపాలు పిల్లలను అనుకరించేలా చేస్తాయి. మేం నిత్యం పిల్లలకు వీటిని నేర్పవలసి వస్తుంది. పనిభారం గతంలో కన్నా అధికమై టీచర్లు కూడ తీవ్ర ఒత్తిడికి లోనవుతున్నారు.

ఇంటికి వెళ్లి, మళ్లీ వాళ్ల కుటుంబ బాధ్యతలు వారు చూసుకోవాలి గదా!అందువలన మీ పిల్లల నైతిక రూపాంతరంకు మీరే బాధ్యత తీసుకోండి. ఇంట్లో ఆంగ్లం, తెలుగు బూతులు వాడకండి. పిల్లలతో ఎక్కువ సేపు గడపండి. మానవత్వం, ప్రేమ, దయ, అహింసకు సంబంధించిన మంచి, చెడు విచక్షణ కథల రూపంలో చెప్పండి. ఏది కావాలంటే అది కొనివ్వకండి. పిల్లలకు బొమ్మ తుపాకులు కూడ కొని పెట్టవద్దు. మొబైల్ ఫోనులు ఇవ్వద్దు. బైకులు, స్కూటర్లివ్వవద్దు. మీరూ మామూలు ఫోన్లకు మారిపోండి. నిజానికి మనలో నూటికి తొంభైమందికి ఏండ్రాయిడ్ లేక ఐఫోన్ లవసరంలేదు. అయినా స్టేటస్ సింబల్గా మనం వాటిని కొని, గంటల తరబడి వాటితో గడిపేస్తున్నాం. ఇదే పిల్లలూ కోరుకొంటున్నారు. మీరు ఏది ఎక్కువసేపు వాడతారో, ప్రదర్శిస్తారో వాటిపట్ల పిల్లలు ఆకర్షితులవుతారు. అనుకరించడం మొదలుపెడతారు.

మళ్లీ మూడు నెలల తర్వాత కలుద్దాం. ఈ కాలంలో మీ పిల్లలో గణ నీయమైన మార్పు రావాలని



ఆశిస్తున్నాం', అని చెప్పి ముగించింది.

పిల్లల తల్లిదండ్రులక ఆవిడ ప్రసంగం అంతగా నచ్చలేదు. 'ఆవిడ తమకే నీతులు బోధిస్తుందా?' అన్నట్లున్నాయి వారి ముఖాలు. 'కాని, మంచి పేరున్న స్కూలు. భరించక తప్పదు' అని అనుకొంటూ బయటికి నడిచారు.

ఇంతలో ఎటెండర్ వచ్చి దూరాన నిల్చోని ఉన్న ప్రధాన అధ్యపకురాలిని చూపి, మేడం మిమ్మల్ని పిలుస్తున్నారు. ఒక్క క్షణం పని ' అని రంజిత్ అమ్మ శ్యామలని తీసుకువెళ్లాడు.

'సారీ అండి. ఇదిగో ఈ గన్ మీదే. మీ అబ్బాయి రంజిత్ స్కూలుకు తెచ్చి తోటి పిల్లలను కాల్చబోయాడు. అదృష్టవశాత్తు క్లాస్ టీచర్ లాక్కొని అది ఏమిటని చూసింది. అందులో బుల్లెట్స్ ఉన్నాయి. లక్కీగా ఏమీ కాలేదు. అది పేల లేదు. పెద్ద ప్రమాదమే తప్పింది. ఏదైనా అయివుంటే ఈ పాటికి ఈ స్కూల్ పత్రికలు, టీవీల్లో ఉండేది. మేమంతా ఏమయ్యే వాళ్ళమో! ఊహించుకొంటేనే భయం వేస్తుంది. మీ బాబును ప్రశ్నిస్తే, ఇంట్లో కూడ ఇలా

# పెద్ద కథ



మిమ్మల్ని టాయ్ గన్ తో బెదిరిస్తే మీరు పడిపోయినట్టు చేస్తారట గదా. అందువలన ఇక్కడా అలానే చేద్దామని తెచ్చాడట' చెప్పింది ప్రధానాధ్యాపకురాలు.

'అవునండి. టీవీలో 'మూవ్' అనే పెయిన్ రిలీఫ్ ఆయింట్మెంట్ అడ్వేర్టైస్మెంట్ లో ఆరు అనే అబ్బాయి వాళ్ళ అమ్మను తుపాకితో కాలుస్తుంటే వాళ్ళమ్మ ఎగురుతూ, తప్పించుకున్నట్లు చేస్తుంది. అది చూసి కావాలని అడిగితే మొన్ననే కొనిపెట్టాం. ఇక ఈ గన్ వాళ్ళ నాన్న కాంట్రాక్టర్ కదా! సెక్యూరిటీ కోసం లైసెన్స్ కట్టి తెచ్చుకొన్నారు. ఇదెట్లా వాడి కంటపడిందో కూడా నాకు తెలియదు. పెద్ద గండమే తప్పింది', అంది శ్యామల.

'ఈ గన్ ఎక్కడినుంచ తెచ్చావు?'అని అడిగితే 'నా టాయ్ గన్ బాగ్ లో పట్టలేదు. అందువలన మా నాన్న గన్ తెచ్చానని చెప్పాడు. దయచేసి ఎవ్వరికీ తెలవనీకుండా దీనిని తీసుకెళ్లండి. మరెప్పుడూ పిల్లవాడు అడిగాడని తుపాకులు, కత్తులు కొనకండి',అని చెప్పి రహస్యంగా ఆవిడ చేతికిచ్చి చకచకా వెళ్లి పోయింది ప్రధాన అధ్యాపకురాలు.

నిశ్చేష్టురాలైంది శ్యామల. పిల్లలేదడిగితే అది ఎందుకు, ఏమి అవసరమనే ఆలోచనలేకుండా, అడిగినదల్లా కొని ఇవ్వటంలో ఔచిత్యం ఏమిటి? – అని తన నిష్ప్రయోజకతకు సిగ్గుపడి తన భర్త ఉన్న వైపుకు వడివడిగా అడుగులు వేసింది శ్యామల.

**–. డా కొప్పరపు నారాయణ మూర్తి**

### బాల గేయం

## బడికి పోయే బాలలం!

బాలలం మేమంతా బడికి పోయే పసిపాపలం!

మేమందరం కలసిమెలసి హాయిగా తిరుగుతాం!

ఆటలనే ఆడుతాం! పాటలనే కలసి పాడుతాం!

బడి గంట వినగానే తరగతులకు మేం చేరతాం!

గురువు పాదాలకు వంగి వందనం మేం చెపుతాం!

బలపంతో పలకపై అక్షరాలు రాసి మేం చదువుతాం!

వంత కలిపి పాటలన్నీ నేర్చి కలసి మేం పాడతాం!

బడి పాఠాలను బాగా చదువుతూ మేం సాగుతాం!

తగవుల జోలికి మేం పోము, సరదాగానే గడుపుతాం!

ఫలహారాలను మేమంతా పంచుకునే తింటాం!

చేతులు కలిపి ఆరుబయట ఆటలనే మేమాడతాం!

బడి వదలగానే మేము పరుగున ఇంటికి చేరతాం!

తాతలు చెప్పే కథలు వింటూ హాయిగా నిదురపోతాం!!

**గోపరాజు వెంకట సూర్యనారాయణ**

# పెద్ద కథ



# శ్రమ విలువ

రంగారావు తన కొడుకు సూరజ్ విషయంలో ఎప్పుడూ దిగులు పడేవాడు. రంగారావు నగరంలో పేరుగన్న ధనికుడు.

అతడి కొడుకు సూరజ్ తల్లి చేతిలో గారాబంగా పెరిగాడు. అతడు బాధ్యత లేకుండా ధారాళంగా డబ్బు ఖర్చు చేసేవాడు. తన చుట్టూ పదిమంది స్నేహితులను వెంటబెట్టుకుని తిరిగేవాడు. ఆ స్నేహితులు సూరజ్ ఖర్చు చేసే డబ్బు కోసం వెంట వుండేవారు.

కొడుక్కి ఎలా బుద్ధివస్తుందోనని దిగులుపడేవాడు రంగారావు.

అనుకోకుండా ఒకరోజు రంగారావు చిన్ననాటి స్నేహితుడు ధర్మారావు వచ్చాడు. చిన్ననాటి కబుర్లు చెప్పుకుంటూ , తమ వ్యాపార వృద్ధి గురించి చర్చించుకున్నారు. ఇద్దరూ వ్యాపారస్థులే కనుక వ్యాపారం లో అభివృద్ధి కోసం సలహాలు ఇచ్చి పుచ్చుకున్నారు. అప్పుడు మాటల్లో నా తదనంతరం ఈ ఆస్తి ఏమవుతుందో , తన కొడుక్కి ఎలా బాధ్యత తెలుస్తుందో అని తన గోడు వెళ్లబోసుకున్నాడు రంగారావు.

అప్పుడు ధర్మారావు ఆలోచించి ఒక సలహా చెప్పి, ఇలా చేస్తే మీ వాడిలో తప్పక మార్పు వస్తుంది అని చెప్పాడు.

#####

ఆ మరునాడు తన ఒక్కగానొక్క కొడుకు సూరజ్ ని పిలిచి " నీ చదువు అయిపోయింది కదా! నీ పనికిరాని ఫ్రెండ్స్ తో అల్లరిచిల్లరగా తిరగడం ఆపి వ్యాపారం చూసుకో" అన్నాడు

"నాన్నా! అలా అనొద్దు. నా ఫ్రెండ్స్ నా కోసం ఏమైనా చేస్తారు. ఇంకొన్నాళ్ళు నన్ను ఇలా ఆనందంగా వుండనీయండి. అప్పుడే అన్ని బాధ్యతలు నాపై పెట్టొద్దు. నాకో లక్ష రూపాయలు కావాలి ఇవ్వండి పార్టీ ఇవ్వాలి ఫ్రెండ్స్ కి" అన్నాడు.

"నేను ఇవ్వను. నువ్వు కష్టపడి సంపాదించు" అంటే ఆయన భార్య

" అదేంటండి! ఒక్కగానొక్క కొడుకు. వాడికే కదా ఇదంతా. ఎందుకు అలా అంటున్నారు" అని డబ్బుల కట్ట తెచ్చి ఇచ్చింది కొడుక్కి.

# పెద్ద కథ



అందులోనుంచి తనకు కావాల్సినంత తీసుకుని మిగతాది టేబుల్ పైన విసిరికొట్టాడు సూరజ్.

"ఇది నా స్వార్జితం. అందుకే దాని విలువ నీకు తెలియట్లేదు నీకు ఉన్నది ఖర్చు చేయడం తప్ప. నువ్వు సొంతంగా కష్టపడి న్యాయంగా ఒక్క లక్ష సంపాదించు చాలు. అప్పుడు నిన్ను నమ్ముతాను. నీ ఫ్రెండ్స్ కి ఇంట్లోంచి వచ్చేసాను అని చెప్పు, మా నాన్న డబ్బులు ఇవ్వనన్నాడు అని చెప్పు అప్పుడు ఎవరైనా నీకు తోడుగా వుంటారేమో చూడు. ఉంటే వాడే నీకు నిజమైన మిత్రుడు. ఆనందం లో నే కాదు కష్టాల్లో కూడా తోడుగా వుండేవాడే నిజమైన స్నేహితుడు" అన్నాడు.

"చూసుకోండి అదేమీ గొప్పా! ఈజీగా సంపాదిస్తాను. నా ఫ్రెండ్స్ ను అడిగితే వాళ్లే ఇస్తారు. ఎన్నోసార్లు వాళ్లకు ఖర్చు చేసాను. ఛాలెంజ్" అన్నాడు సినిమాలో హీరోగారి డైలాగ్ లా

#####

ఫ్రెండ్స్ అందరినీ డబ్బులు అడిగాడు విషయం వివరించి. కానీ వీడికిస్తే మళ్ళీ తిరిగిరావు మన డబ్బులు అనుకుని ఎవ్వరూ సాయం చేయకుండా ఏదో ఒకటి చెప్పి తప్పించుకున్నారు.

నీరసం వచ్చింది. జాబ్స్ కోసం తిరిగాడు తనకు కావాల్సిన జాబ్ లేదు. ఆ రోజంతా ఇంటికి వెళ్ళడానికి ఉక్రోషం వచ్చింది. దాంతో అలాగే తిరిగాడు పట్టుదల గా ఏ చిన్న జాబ్ అయిన చేద్దామని.

చివరికి ఓ చిన్న హోటల్ లో ఎవరో సర్వర్ రాకపోవడంతో సూరజ్ కి పని దొరికింది. ఆ వారం అంతా పని చేస్తే వారం జీతం చేతిలో పెట్టారు. అతి తక్కువ డబ్బు అయినా అవి చేతిలో పట్టుకుంటే ఎంతో ఆత్మ సంతృప్తి, ఆనందం కలిగాయి.

ఇంటికి వెళ్ళి తను ఈ వారంలో సంపాదించిన మొత్తం అని జాగ్రత్తగా టేబుల్ పై పెట్టాడు.

రంగారావు స్నేహితుడైన ధర్మారావుతో కలిసి కూర్చుని ఉన్నాడు అక్కడ. కొడుకు ప్రయోజకుడు అయ్యాడని సంతోషిస్తున్న రంగరావును సైగ తో వారించి,

ధర్మారావు "నువ్వు సంపాదించింది ఇంతేనా" అంటూ చేతిలోకి తీసుకుని లెక్కించినట్టు చేసి టేబుల్ పైకి విసిరాడు. ఆ డబ్బులో కొంత చిల్లర కూడా వుందేమో దొర్లుకుంటూ కింద పడ్డాయి.

వెంటనే కోపం, ఉక్రోషం వచ్చిన సూరజ్ " నేను ఎంతో కష్టపడి సంపాదించిన డబ్బు అలా విసిరేస్తారేంటి మామయ్యా?" కోపంగా అని కిందపడ్డవి జాగ్రత్తగా తీసి టేబుల్ పై పెట్టాడు.

అప్పుడు ధర్మారావు చిరునవ్వు తో "సూరజ్! ఇప్పుడైనా డబ్బు విలువ తెలిసిందా నీకు! మనం ఎంత సంపాదించినది ముఖ్యం కాదు. ఎలా సంపాదించాము

# పెద్ద కథ



అన్నదే ముఖ్యం. కష్టపడి, న్యాయం గా సంపాధిస్తే దాని విలువ ఎక్కువ. అయాచితంగా వస్తే దాని విలువ తెలియదు. నిన్నటివరకూ మీ నాన్న సంపాదించింది ఎంత విచ్చలవిడిగా ఖర్చు చేసావు ఆలోచించుకో! కానీ అప్పటికి, ఇప్పటికీ తేడా నీకే తెలుస్తోందిగా!

మనిషి ఎదుగుతున్న కొద్దీ కొన్ని బాధ్యతలు నిర్వర్తించాలి. ఇప్పుడు నువ్వు నాన్న వ్యాపారం చూసుకుంటూ, పెళ్లి చేసుకుని ఆయనకు కాస్త విశ్రాంతి ని ఇవ్వాలి.

మనిషి జీవితం హక్కులే కాదు బాధ్యతలతో కూడా ముడిపడి ఉంది. తల్లిదండ్రుల పట్ల కొన్ని బాధ్యతలు, పెళ్లి చేసుకున్నాక భార్యాపిల్లల పట్ల కొన్ని బాధ్యతలు, మనం జీవించే ఈ సమాజం పట్ల కొన్ని బాధ్యతలు ఉంటాయి ప్రతి మనిషికీ.

జీవితంలో ఏ దశలో దానికి అనుగుణంగా ఆ బాధ్యత నిర్వర్తించాలి" అంటూ హితబోధ చేసాడు ఇనుము వేడి మీద ఉన్నప్పుడే సమ్మెట దెబ్బలు వేయాలి అనుకుని.

డబ్బు విలువ తెలుసుకున్న సూరజ్ తండ్రి చెప్పినట్టుగా విని వ్యాపారం బాగా అభివృద్ధి చేసాడు. ధర్మారావు తన కూతురిని ఇచ్చి వివాహం చేసాడు. అలా రంగారావు దిగులు తీరింది.

★★★ శుభం ★★★

-సుధావిశ్వం




**చీమలు పెట్టిన పుట్టలు**
**పాముల కిరువైన యట్లు పామరుడు దగన్**
**హేమంబు గూడబెట్టిన**
**భూమీశుల పాలజేరు భువిలో సుమతీ!**

**భావము :**

**ఓ సుమతీ! భూమిలో చీమలు కష్టపడి పెట్టిన పుట్టలలో పాములు చేరును. అట్లే, మూర్ఖుడు దాచి ఉంచిన బంగారం రాజుల పాలై అతనికి ఉపయోగపడక పోవును.**




# విశ్వేశ్వరయ్య ఇండస్ట్రియల్ అండ్ టెక్నలాజికల్ మ్యూజియం

భారత ప్రభుత్వ సాంస్కృతిక మంత్రిత్వ శాఖకు చెందిన నేషనల్ కౌన్సిల్ ఆఫ్ సైన్స్ మ్యూజియమ్స్ (NCSM) యొక్క ఒక విభాగమైన బెంగళూరులోని విశ్వేశ్వరయ్య ఇండస్ట్రియల్ అండ్ టెక్నలాజికల్ మ్యూజియం (VITM) భారతరత్న సర్ ఎం. విశ్వేశ్వరయ్య జ్ఞాపకార్థం స్థాపించబడింది. కబ్బన్ పార్క్ యొక్క ప్రశాంతమైన పరిసరాల్లో 4000 చదరపు మీటర్ల విస్తీర్ణంలో ఒక నిరాడంబరమైన భవనం నిర్మించబడింది, దీనిలో వివిధ పారిశ్రామిక ఉత్పత్తులు మరియు ఇంజిన్లు ఉన్నాయి, దీనిని భారతదేశ మొదటి ప్రధాన మంత్రి పండిట్ జవహర్‌లాల్ నెహ్రూ 14.07.1962న ప్రారంభించారు. విద్యుత్ అనే ఇతివృత్తంతో VITMలో ఏర్పాటు చేసిన మొదటి గ్యాలరీని 27.07.1965న అప్పటి కేంద్ర సమాచార & ప్రసార శాఖ మంత్రి & భారతరత్న ఇందిరా గాంధీ ప్రజలకు ప్రారంభించారు.

VITMలో మొబైల్ యాప్ సౌకర్యంతో కూడిన డైనోసార్ కార్నర్ & రైట్ బ్రదర్స్ ఫ్లైయర్ కిట్టి హాక్ యొక్క 1:1 స్కేల్ ప్రతిరూపం మరియు ఫ్లైయర్ సిమ్యులేటర్ ఉన్నాయి, ఇది సందర్శకులకు లీనమయ్యే మరియు వినోదాత్మక అనుభవాన్ని అందిస్తుంది. ఆసియాలో ఏకైక VITM వద్ద ఉన్న సైన్స్ ఆన్ ఎ స్పియర్ అనేది ఒక పెద్ద విజువలైజేషన్ సిస్టమ్, ఇది గోళంపై యానిమేటెడ్ డేటాను ప్రదర్శించడానికి మల్టీమీడియా ప్రొజెక్షన్‌లను ఉపయోగిస్తుంది, ఇది ఒక గ్రహం యొక్క వాతావరణం, సముద్రం మరియు భూ ప్రాంతం యొక్క డైనమిక్, యానిమేటెడ్ చిత్రాలను చూపించే లీనమయ్యే యానిమేటెడ్ గ్లోబ్‌గా మారుస్తుంది, కథనంతో కలిపి ఉంటుంది. VITMలో ఇంజిన్ హాల్, ఫన్ సైన్స్, ఎలక్ట్రోటెక్నిక్, స్పేస్ ఎమర్జింగ్ టెక్నాలజీ ఇన్ ది సర్వీస్ ఆఫ్ మ్యాన్‌కైండ్, బయోటెక్నాలజీ రివల్యూషన్, BEL హాల్ ఆఫ్ ఎలక్ట్రానిక్స్ అండ్ చిల్డ్రన్ సైన్స్ అనే పేరుతో 7 శాశ్వత ప్రదర్శన గ్యాలరీలు ఉన్నాయి.

ఇక్కడ ప్రదర్శించబడే వాటిలో ఎక్కువ భాగం అనేక సైన్స్ మ్యూజియంలలో 3D షోలతో సహా మీరు కనుగొనేవే. అయినప్పటికీ, ఇక్కడ చూడటానికి మరిన్ని రకాలు ఉన్నాయి.వేలాడుతున్న విమాన నమూనాలు, కొన్ని




ఇంజిన్లు పనిచేసే విధానం, మరియు పెద్ద డైనోసార్ మోడల్ కూడా!

గేర్లు పనిచేయడం, బెల్ట్ కదలికలు, ఇంజిన్ పనిచేయడం మరియు అన్ని యాంత్రిక విషయాల ప్రదర్శనలను నేను ఎక్కువగా ఇష్టపడేవాడిని. ఆ కదలికలు నన్ను నిమగ్నం చేశాయి! ఈ మ్యూజియంలో వివిధ రకాల పనుల కోసం అనేక గదులు ఉన్నాయి. మరియు సాధారణ ప్రేక్షకులకు సులభతరం చేయడానికి, అన్ని గదులు ఏక దిశలో అనుసంధానించబడి ఉన్నాయి. మీరు ఒక తలుపు ద్వారా అనేక ప్రదర్శనలు ఉన్న గదిలోకి వెళ్లి, మరొక తలుపు నుండి పూర్తిగా భిన్నమైన థీమ్ ఉన్న గదికి నిష్క్రమిస్తారు. విశ్వేశ్వరయ్య మ్యూజియం ప్రవేశ రుసుము – సాధారణ సందర్శకులకు, ఇది 75 రూపాయలు పాఠశాల సమూహాలకు ధరలు తక్కువగా ఉంటాయి . మ్యూజియంలోని 3D షో, సైన్స్ ఆన్ ఎ స్పియర్ మరియు రైట్ బ్రదర్స్ ఫ్లయింగ్ సిమ్యులేటర్ వంటి ఇతర ప్రదర్శనలకు కూడా ధరలు ఇవ్వబడ్డాయి.

విశ్వేశ్వరయ్య ఇండస్ట్రియల్ అండ్ టెక్నలాజికల్ మ్యూజియం సమయాలు – ఇది సంవత్సరంలో అన్ని రోజులు ఉదయం 9:30 నుండి సాయంత్రం 6 గంటల వరకు తెరిచి ఉంటుంది. కానీ దీపావళి వంటి కొన్ని సందర్భాలలో ఇది మూసివేయబడుతుంది.

ఉదయం వేళల్లో మ్యూజియం సందర్శించండి – విశ్వేశ్వరయ్య మ్యూజియం సందర్శించడానికి ఉత్తమ సమయం ఉదయం వేళలు. మీరు ప్రదర్శనలను చూసినప్పుడు మరింత ప్రశాంతత ఉండటమే కాకుండా, పెద్దగా గందరగోళం కూడా ఉండదు.



# అక్బర్-బీర్బల్ కథలు



## దొంగ సాధువు

అక్బరు చక్రవర్తి సువిశాల సామ్రాజ్యంలో సుల్తాన్‌పురి అనే ఒక ఊరు ఉండేది. ఆ ఊరిలో ఒక ఆశ్రమం ఉండేది, అందులో ఒక గుడ్డివాడైన సాధువు నివసిస్తుండేవాడు. ఎప్పుడూ తపస్సు చేసుకుంటూ ఉండే ఆ సాధువుకు ఊరి జనాలందరి భవిష్యత్తు తెలుసని ప్రజలందరూ నమ్ముతూ ఉండేవారు. ఒకరోజు అతడి ఆశ్రమానికి ఒక వ్యక్తి తన అన్నకూతురును తీసుకొస్తాడు. ఆ అమ్మాయికి ఆరోగ్యం సరిగా లేదు. ఎందుకంటే అంతకు కొన్నిరోజుల క్రితం ఆమె కళ్లెదురుగానే ఆమె అమ్మా, నాన్నలను ఎవరో దారుణంగా చంపేశారు. ఆ ఘాయిత్యాన్ని కళ్లారా చూసిన ఆ అమ్మాయికి అప్పటినుండి బుద్ధి స్వాధీనంలో లేకుండా తయారవుతుంది.

దీనికి బాధపడ్డ ఆ అమ్మాయి చిన్నాన్న ఈ సాధువు బాగుచేస్తాడన్న నమ్మకంతో వైద్యం కోసం తీసుకొస్తాడు. అయితే ఆ అమ్మాయి ఆ సాధువును చూడగానే... ఏడుపు మొదలుపెట్టింది. తన అమ్మానాన్నలను చంపింది అతడే అని ఏడుస్తూ చెప్పింది. అది విన్న జనాలంతా ఆశ్చర్యపోయారు. మహానుభావుడైన సాధువు ఎవరినైనా ఎందుకు చంపుతాడు. పైగా గుడ్డివాడు ఆ పని ఎలా చేస్తాడని తమలో తాము అనుకోసాగారు. అంతే కాదు ఆ అమ్మాయికి పిచ్చిపట్టిందని, అందుకే ఏవేవో మాట్లాడుతోందని అన్నారు. దీన్ని ఆసరాగా తీసుకున్న ఆ సాధువు కూడా ఆ విషయాన్నే నిర్ధారించి ఆశ్రమం నుండి వాళ్లను వెళ్లగొట్టించాడు.అయితే ఆ అమ్మాయి రోజంతా అలాగే ఏడుస్తూనే ఉంటుంది. దీంతో ఆమె చెప్పిన మాటలు నిజమేనన్న సందేహంతో ఆమె చిన్నాన్న బీర్బల్ దగ్గరకు తీసుకెళ్ళాడు. జరిగినదంతా విన్న బీర్బల్ మరుసటిరోజు ఆ అమ్మాయిని, ఆమె చిన్నాన్నను, గుడ్డివాడైన సాధువును రాజు సభకు పిలిపించాడు.

నువ్వు ఈ అమ్మాయి అమ్మానాన్నలను చంపావా? అని గుడ్డి సాధువు ప్రశ్నించాడు బీర్బల్. "నేను గుడ్డివాడిని, నేనెలా చంపగలను?" అన్నాడు సాధువు సమాధానంగా. అలాగా..?! అంటూ ఒక్క నిమిషం వ్యవధిలో కత్తి తీసి సాధువు మీదికి ఉరికాడు బీర్బల్. అంతే... తనకు అపాయం ముంచుకొస్తోందని గ్రహించిన సాధువు వెంటనే మరో కత్తి తీసుకుని బీర్బల్ పైకి ఎదురుదాడికి దిగాడు దొంగసాధువు.అసలు రూపాన్ని బయటపెడుతూ తనపైకి దాడికి దిగిన దొంగ సాధువు తలను ఒక్క దెబ్బతో తెగ్గొట్టాడు బీర్బల్. అంతేగాకుండా అతడివల్ల నష్టపోయిన ఆ అమ్మాయికి రాజు ఆస్థానంలోనే ఆశ్రయం కల్పించాడు .

# తెనాలిరామకృష్ణ కథలు



## రాయలవారి కల

ఐదువందల సంవత్సరాల క్రితం విజయనగరమనే సామ్రాజ్యాన్ని శ్రీ కృష్ణదేవరాయులు పరిపాలించేవారు. ఆయిన ఒక రోజు నిద్రలో ఒక కల కన్నారు. ఆ కలలో ఆయినకొక అందమైన భవనము కనిపించింది.

ఆ భవనం ఆకశంలో తేలుతూ, లక్ష దీపాలతో చాలా అద్భుతంగా వుంది. తలుచుకుంటే చాలు, మాయమైపోయే ఆ భవనాన్ని కలలో చూసిన రాయలు ఆ కలను మరువలేకపోయారు. మర్నాడు సభలో ఆయిన ఆ కలను వివరించి దాన్ని నిజం చేయాలన్న ఆయిన గట్టి నిర్ణయాన్ని అందరికీ తెలిపారు.

అది విన్న వారంత అలాంటి భవనమును ఎలా కట్టగలము అసలు గాలిలో తేలే భవనాన్ని కట్టడం అసాధ్యము కదా అని నచ్చచెప్పడానికి ప్రయత్నించారు. రాయులు కోపగించుకుని "అదంతా నాకు అనవసరం. మీరేంచేస్తారో నాకు తెలీదు కాని నా కల నిజమవ్వాలి. అలాంటి భవనాన్ని కట్టిన వారికి నేను లక్ష వరహాల బహుమానము ఇస్తాను లేదా మీరందరు నాకు కనిపించకండి" అని ఆజ్ఞాపించారు.

విన్నవారంత నిర్ఘాంతపోయారు. ఎన్ని రోజులు గడిచినా రాయులు ఆ కలను మరువలేదు.

ఒక రోజు సభకొక వృద్ధుడు వచ్చాడు. నెరిసిపోయిన గెడ్డం, జుత్తు, మీసాలతో పాపం అతి కష్టం మీద కర్రతో నడుస్తున్నాడు. నాకు అన్యాయం జరిగింది, న్యాయం చేయండి అని రాయులవారిని ప్రార్థించాడు. "నీకేమన్యాయం జరిగిందో నిర్భయంగా చెప్పు, నేను న్యాయం చేస్తాను" అని రాయులు హామి ఇచ్చారు.

"నా దగ్గర నూరు నాణ్యాలున్నాయి స్వామి, అవి ఒకరు దొంగలించుకుపోయారు. నాకు వారెవరో తెలుసు, నా నాణ్యాలు అడిగి ఇప్పించండి" అని ఆ వృద్ధుడు విన్నపించాడు.

శ్రద్ధగా విన్న రాయులు ఈ దొంగతనం యెవరు చేసారు, యెక్కడ చెసారు అని ప్రశ్నించారు.

వృద్ధుడు తడపడడం చూసి "నీకేమి భయం లేదు, చెప్పు" అని రాయులు ప్రోత్సహించారు.


# తెనాలిరామకృష్ణ కథలు

"నా నూరు నాణ్యాలు దొంగలించింది మీరే స్వామి" అన్నాడు వృద్ధుడు. "నిన్న రాత్రి నా కలలో వచ్చి మీరే అవి దోచారు."

రాయులకు చాలా కోపం వచ్చింది. "ఏమిటీ వెటకారం! కలలో జరిగినది నిజమనుకుంటే ఎలా?" అని కోపంగా అడిగారు. ఈ మాట విన్న వృద్ధుడు తన గెడ్డం, మీసం తీసేసి, కర్రను పక్కకు పడేసి, పగటి వేశాన్ని విప్పేసాడు. చూస్తే అతను తెనాలి రామకృష్ణ.

"క్షమించండి స్వామి మీ కలను నిజం చేయడం ఎంత కష్టమో నిరూపించడానికే ఇలా చేసాను" అన్నాడు తెనాలి.

రాయులకు చాలా నవ్వొచ్చింది. ఇంత చక్కగా ఆయినకు అర్ధమయ్యేలా చెప్పిన తెనాలి రామకృష్ణను ఆయిన చాలా అభినందించారు.



★★★★★★

## ఆర్థిక శాస్త్రం



# పిల్లలకు డబ్బు విలువ నేర్పుదాం

పిల్లలూ!

అమ్మాయిలూ, అబ్బాయిలూ!

మీకు, 'డబ్బు' అంటే ఏమిటో తెలుసా? అది తెలుసుకొనే పనే ఇప్పుడు చేద్దాం. – 'డబ్బు' గా మనకు కనపడేది చిన్న గుండ్రటి బిళ్ళ. లేకపోతే, చిన్న కాయితం ముక్క. అది ఇచ్చి పెన్సిళ్ళు కొంటాం, పెన్నులు కొంటాం, బిస్కట్లు కొంటాం, పుస్తకాలు కొంటాం. ఎన్నో వస్తు వులు కొంటాం. డబ్బు ఇస్తే, ఏ వస్తువు అయినా వస్తుంది కదా? అయితే, "డబ్బు ఇస్తే వస్తువులు ఎందుకు వస్తాయి? డబ్బు అంటే ఏమిటి?" అనే సందేహాలు మీకు ఎప్పుడన్నా వచ్చాయా? ఎప్పుడూ వచ్చి ఉండవు. ఇలాంటి ప్రశ్నలు పెద్ద వాళ్ళకే రావు. ఇక పిల్లలకేం వస్తాయి?

'డబ్బు అంటే ఏమిటి?" అని, మీ ఇంట్లో పెద్ద వాళ్ళనో, మీ బళ్ళో టీచర్లనో, అడగండి! వాళ్ళేం చెపుతారో వినండి! వాళ్ళేం చెపుతారంటే, డబ్బు అంటే, దానితో మనం వస్తు వులు కొనుక్కుంటాం కదా? అదే డబ్బు. వస్తువులు కొనుక్కోవ టానికి ఉపయోగపడేదే డబ్బు!" అని చెపుతారు. అంతే చెపుతారు. ఆ జవాబు తోటే మీకు డబ్బు అంటే ఏమిటో తెలిసి పోతుందా? ఆ జవాబు సరిపోదు.

మళ్ళీ అడగండి! "డబ్బు ఇస్తే వస్తు వులు ఎందుకు వస్తాయి? డబ్బు అంటే చిన్న బిళ్ళే కదా? లేకపోతే చిన్న కాయితం ముక్కే కదా? అందులో ఏం ఉంటుంది? ఆ కాగితం ముక్క ఇవ్వకుండా వస్తువులు తీసుకో కూడదా? మొన్న అత్తయ్య అరిసెలు తీసుకొచ్చింది. మనం డబ్బు ఇవ్వకుండానే తీసుకున్నాం కదా? డబ్బుతో వస్తువుల్ని కొనాలంటే, మనకు అసలు డబ్బు ఎలా వస్తుంది? అందరికీ డబ్బు ఎలా వస్తుంది? ఎందుకు వస్తుంది? ఎక్కడ నుంచి వస్తుంది?" – ఇలాగ ఇంకా కొన్ని ప్రశ్నలు అడగండి!.

కానీ, మీ అమ్మలూ, నాన్నలూ, ఒక్క ప్రశ్నకి కూడా సరిగా జవాబు చెప్పలేరు. బళ్ళో టీచర్లు కూడా చెప్పలేరు. ఎందుకు చెప్పలేరంటే, వాళ్ళకి ఆ విషయాలు తెలీవు. తెలిస్తే చెప్పకుండా దాచుకోరు కదా? తెలీదు కాబట్టే చెప్పలేరు. కానీ ఆ మాట వాళ్ళు ఒప్పుకోరు. మాకు తెలీదర్రా" అనరు. అంతా తెలిసినట్టే, మొదట చెప్పిందే మళ్ళీ మళ్ళీ చెప్పుకొస్తారు. "డబ్బు ఇవ్వకపోతే వస్తువులెలా వస్తా యర్రా? ఊరికే వస్తాయా? ఆ మాత్రం తెలీదా? భలే అడుగుతున్నారే!" అని దబా యించి, మీ ప్రశ్నలన్నీ ఎగర గొడతారు.

# ఆర్థిక శాస్త్రం



అసలు నిజానికి పిల్లలు అలాంటి ప్రశ్నలు అడిగితే, పెద్ద వాళ్ళు చాలా ఆశ్చర్యపడాలి. "అవును కదా? ఇన్నాళ్ళూ మనం ఆలోచించలేదు. డబ్బు అంటే చిన్న కాయితం ముక్కేగా? అది ఇస్తే వస్తువులు ఎందుకు రావాలి?" అని వాళ్ళు మళ్ళీ మళ్ళీ ఆశ్చర్యపోవాలి. డబ్బు అంటే ఏమిటో తెలుసు కోవాలని వాళ్ళకి కూడా ఆసక్తి కలగాలి.

కానీ, వాళ్ళకి ఏ ఆశ్చర్యాలూ వుండవు. అన్నిటికీ బద్ధకం! ఆశ్చర్యపోవడానికి కూడా బద్ధకం! ఆలోచించడానికి బద్ధకం! బుర్రలు ఉపయోగించడానికి బద్ధకం!

నిజానికి, డబ్బు గురించి ఇప్పుడు మనం కొత్తగా ఆలోచించ వలసిందేమీ లేదు. వెనకటి వాళ్ళే ఆలోచించి చెప్పే శారు. మనం అది తెలుసుకుంటే చాలు! డబ్బు అంటే ఏమిటో తెలుసుకోవాలంటే, 'వస్తువుల్ని కొనే గుణం' డబ్బుకి ఎలా వచ్చిందో తెలుసుకోవాలి. అంత కన్నా ముందు, 'వస్తువులు' అంటే ఏమిటో తెలుసు కోవాలి. డబ్బు కూడా ఒక వస్తువే. అందుకే 'వస్తువుల' గురించి మొదట తెలుసు కోవాలి. 'డబ్బు' గురించి తెలుసు కోవడానికి మనం చాలా పాఠాలు చూడ వలసి వస్తుంది.

(ఇంకా ఉంది )

రామలక్ష్మి గారి "పిల్లలకు ఆర్థిక శాస్త్రం నుండి ....

# రేపటి తరం

## “రోబో “సంగతులు








రోబోట్ అనేది ఒక యంత్రం – ముఖ్యంగా కంప్యూటర్ ద్వారా ప్రోగ్రామ్ చెయగలది – సంక్లిష్టమైన చర్యల శ్రేణిని స్వయంచాలకంగా నిర్వహించగల సామర్థ్యం కలిగి ఉంటుంది. రోబోలు స్వయంప్రతిపత్తి లేదా సెమీ–అటానమస్ కలిగి ఉంటాయి.రోబోలు అనేవి నిర్దిష్ట పనులను నిర్వహించడానికి ప్రోగ్రామ్ చేయబడిన యంత్రాలు. అవి సాధారణంగా యాంత్రిక, విద్యుత్ మరియు కంప్యూటర్ భాగాల కలయికతో నిర్మించబడతాయి మరియు వాటి పర్యావరణంతో సంకర్షణ చెందడానికి ప్రోగ్రామ్ చేయబడతాయి.

హోండా యొక్క అడ్వాన్స్డ్ స్టెప్ ఇన్ ఇన్నోవేటివ్ మొబిలిటీ ( ASIMO ) మరియు TOSY యొక్క TOSY పింగ్ పాంగ్ ప్లేయింగ్ రోబోట్ ( TOPIO ) వంటి హ్యూమనాయిడ్ల నుండి పారిశ్రామిక రోబోట్‌లు , మెడికల్ ఆపరేటింగ్ రోబోట్‌లు , పేషెంట్ అసిస్ట్ రోబోట్‌లు, డాగ్ థెరపీ రోబోట్‌లు, సమిష్టిగా ప్రోగ్రామ్ చేయబడిన స్వార్మ్ రోబోట్‌లు , జనరల్ అటామిక్స్ MQ–1 ప్రిడేటర్ వంటి UAV డ్రోన్‌లు మరియు మైక్రోస్కోపిక్ నానోరోబోట్లు ఇలా చాల ఉంటాయి.

జీవం ఉన్న రూపాన్ని అనుకరించడం ద్వారా లేదా కదలికలను ఆటోమేట్ చేయడం ద్వారా, ఒక రోబోట్ తెలివితేటల భావాన్ని లేదా దాని స్వంత ఆలోచనను తెలియజేయవచ్చు. భవిష్యత్తులో స్వయంప్రతిపత్తి విషయాలు విస్తరిస్తాయని భావిస్తున్నారు, గృహ రోబోటిక్స్ మరియు స్వయంప్రతిపత్త కారు డ్రైవర్లుగా కొన్ని ప్రధానంగా ఉంటాయి.నౌకరీ చేసే వ్యక్తిని నౌకరు అన్నట్లే చాకిరీ చేసే పనిముట్టుని “చాకరు” అనొచ్చు. కనుక రోబాట్ కి తెలుగు సేత “చాకరు.” స్థూలంగా రోబాట్లలో యాంత్రిక విభాగం, విద్యుత్ విభాగం అని రెండు భాగాలు ఉంటాయి. చెయ్యవలసిన పనికి అనుకూలంగా ఒక చట్రం (frame) ఉంటుంది. ఉదాహరణకి మనిషిని పోలిన చాకరులో అస్థిపంజరాన్ని పోలిన చట్రం ఉండొచ్చు. లంకెలని రోబాట్ ఎముకలుగా ఊహించుకోవచ్చు. చోదకులని (actuator లని) కండరాలుగా పరిగణించవచ్చు). ఈ భాగాలు ఒకటి లేదా అంతకంటే ఎక్కువ పరామితులu (parameters) వాడకానికి వీలు కల్పిస్తాయి. అనేక సమకాలీన రోబాట్‌లు శ్రేణిక చయనికలని ఉపయోగిస్తాయి, ఈ చయనికలలో ప్రతి లంకె ముందువైపు ఒకదానితో, వెనుకవైపు మరొకదానితో అనుసంధానించబడివుంటుంది. ఈ రోబాట్లను శ్రేణిక చాకర్లు అని పిలుస్తారు, ఎక్కువగా ఇవి మానవ చేతిని ప్రతిబింబిస్తాయి. వివిధ జంతువుల, కీటకాల నిర్మాణాన్ని ప్రతిబింబించే ఇతర కట్టడాలు చాలా అరుదుగా కనిపిస్తుంటాయి.

## కథ





# టింకూ పొరపాటు

ఆ అడవిలో ప్రతి సంవత్సరం చిత్రా పౌర్ణమి సమయంలో కోతులకు ఆటల పోటీలు జరిగేవి . టింకూ, బింటూలు ఒకే కోతి తల్లి పిల్లలు. కోతి తల్లి ఇద్దరినీ సమంగా చూసేది. తన ఇద్దరి పిల్లలను ఆటల పోటీలో పాల్గొనడం కోసం అన్ని విధాలా శిక్షణ ఇచ్చింది . ఆ పోటీలలో ఇతర కోతులకన్నా టింకూ , బింటూలు ఎక్కువగా బహుమతులు తెచుకొనేవి .తల్లి తన పిల్లలిద్దరికినీ చూసి మురిసిపోయేది.

మరో చిత్రా పౌర్ణమికి జరిగే పోటీలలో అన్ని మొదటి బహుమతులు తెచ్చుకోవాలని టింకూ బింటూ లిద్దరూ మనసులో అనుకొన్నాయి. ఇద్దరూ బాగా కష్టపడి అభ్యసించాయి.

ఈ సారి జరిగిన పోటీలలో ఎక్కువ మొదటి బహుమతులను బింటూ గెలుచుకోవడం చూసిన టీంకూ అవమానంగా భావించి ఎవరికీ చెప్పకుండా అడవి వదలి వెళ్ళింది.

అడవి దాటి వెళ్లిన తరువాత ఒక కుందేలును చూసి ఇక్కడ ఎక్కడైనా పండ్ల చెట్లున్నాయా అంటూ అడిగింది.

"బంగారులాంటి అడవి వదలి మనుషులు సంచరించే ఇక్కడ పళ్ళ చెట్లు కోసం వెతకడం ఆశ్చర్యంగా వుంది .అక్కడ ఒక దేవాలయం వుంది అక్కడకు వెళితే కోతులకు ఉచితంగా ఆహారం అందజేస్తారు వేళ్ళు."అంది కుందేలు.

టింకూ సంతోషంగా వెళ్ళింది. ఆ గుడిలో ప్రతిరోజూ ఉదయం సాయంత్రం కోతులకు ఆహారం పెట్టడం అలవాటు. అక్కడ ఎన్నో కోతులు జీవిస్తున్నాయి. ఉదయం సాయంత్రం వేళలో వారు పెట్టె ఆహారాన్ని తింటూ, అక్కడున్న చెట్లపైన నిదురించేవి. టింకూకి ఈ జీవితం చాలా హాయిగా వున్నట్లనిపించింది .

ఒక రోజు టింకూ తల్లి వెతుక్కుంటూ గుడిదగ్గరకు వచ్చింది

" టింకూ, గెలుపు ఓటమిలు ఆటల్లో సహజం. చిన్న విషయానికి బాధపడి మమ్మల్ని వదలి వెళ్లడం తప్పుకాదా. నీకోసం చుట్టుపక్కల అడవులన్నీ వెతికాను. పద మన అడవికి పోదాము .ఈ చిత్రా పౌర్ణమి ఆటలపోటీలో నీవు పాల్గొనాలి. "

"నేనెందుకూ బింటూ వుందిగా "అక్కసుగా అంది

" టింకూ, ఈ చిత్రా పౌర్ణమికి బింటూ ఆటలపోటీలో పాల్గొనదు." అంది తల్లి

"ఎందుకూ "ఆశ్చర్యంతో అడిగింది

# కథ



" అడవుల మధ్య జరిగే పోటీలో పాల్గొనడానికి శేషాచలం ఆడవికి వెళ్ళింది .అక్కడే వున్న కోతి గురువులు ప్రత్యేక శిక్షణ ఇస్తున్నారు." అంది.

ఈ సారి బహుమతులన్నీ తనకే అన్న ఆనందంతో తల్లితో కలసి బయలుదేరింది.

చిత్రా పౌర్ణమికి కోతుల ఆటల పోటీలు ప్రారంభమైంది.ఎవరూ ఎదురుచూడని విధంగా టింకూ అన్ని ఆటల పోటీలలో చివరి కోతిగా ఉండటం చూసి అందరూ ఆశ్చర్య పడ్డారు.

వృద్ధ కోతి వచ్చి" టింకూ, నీవు ఇలా వెనుక బడటానికి కారణం నీవే. హాయిగా అడవిలో ఆడుతూ పాడుతూ నీ శారీరక బలాన్ని పెంచుకొన్నావు .ఏదో కోపంతో ఈ అడవి వదలి వెళ్లి ఉచితముగా పంచే ఆహారం తింటూ ఎటువంటి ఆటలు, శారీరక శ్రమ లేకుండా లావయ్యావు. మానవ ప్రపంచంలో నేటి బాలలు ఆటల ద్వారా కలిగే శారీరక శ్రమ వలన ఆరోగ్యం మెరుగుపడటంతో పాటు బుద్ధి వికాసం పెరుగుతుందన్న ఆలోచన లేకుండా ఇంటిలోనే కూర్చొని వీడియో గేమ్స్ చూసుకొంటూ బలహీనులవుతున్నారు "

టింకూ తాను చేసిన పొరపాటు తెలుసుకొంది

(అయిపోయింది)

**-ఓట్ర ప్రకాష్ రావు**

### బాల గేయం
## మాతృ భాష

మాతృ భాషపై పెంచుకో మమకారం

పర భాష మత్తులో పెంచుకోకు మాతృ భాషపై చులకన భావం

అమ్మ ప్రేమలో లేదు ఏ స్వార్థము

అమ్మ నేర్పే భాష మన ప్రగతికి మూలము

మాతృ భాషకు రాదు ఏ భాష పోటి

మాతృ భాషకు కాదు ఏ భాష సాటి

అక్షరాల మకుటము ధరించావు మాతృభాషలో

అంతరిక్షాన్ని చేరి విస్మరించకు నిజ భాష కిరీటం

భావ వ్యక్తికరణకు భవ్యమైనది మాతృభాష

సంస్కృతి, సంస్కారం నేర్పించేది మాతృభాష

మన అభివృద్ధికి మూలం మాతృభాష

మనసులో ఆనందాన్ని చూపించగలిగేది మాతృభాష

ఏ భాషనైనా గెలవడానికి మూలం మాతృభాష

ఏ భాషనైనా నేర్చుకోవడానికి ముగింపు కాకూడదు మాతృభాష

ధరించే దుస్తులలో వెల్లివిరుస్తుంది మాతృభాష
జీవితంలో దోస్తులను సమకూరుస్తుంది మాతృభాష

మన ఉనికి తెలుపుతూ శాశ్వత చిరునామాగా నిలిచెను మాతృభాష చివరి శ్వాస వరకు చిరస్మరణీయం కావాలి మాతృభాష

**-గంటి ఆశ పద్మిని**

# మెదడుకు మేత - 1



## పొడుపు కథలు :

1 అడవిలో పుట్టింది,అడవిలో పెరిగింది;మా ఇంటి కొచ్చింది,తైతక్కలాడింది.ఎవరు?.

2. ఆమడ నడిచి అల్లుడొస్తే,మంచం కింద ఇద్దరూ,గోడ మూల ఒకరూ,దాగుకున్నారు.



## కనుక్కోండి చూడడం :

పక్కన ఉన్న బొమ్మలోన ని చేపలలో ఒక చేప అన్నిటికన్నా భిన్నంగా ఉంది .దాన్ని కనుగొనండి .

## కొంటె ప్రశ్నలు :

1. అన్నం తినకపోతే ఏమవుతుంది?

2. నిఘంటువులో తప్పుగా ఉండే పదం?





# అయినా - బుద్ధి మారలేదు

చిత్రావతి నదీ తీరంలో ఉన్న అడవిలోకి ఒళ్ళంతా గాయాలతో ప్రవేశించింది ఓ నక్క. ఆ నక్కను చూడగానే "అయ్యా.. ఆ గాయాలేమిటి? అసలు మీరు ఎవరు? ఎక్కడి నుండి వస్తున్నారు?" అంటూ ప్రశ్నించింది కోయిల.

"నా పేరు కారుణ్యం. నేను పక్క అడవిలో ఉంటాను. చిన్న జంతువులను అన్యాయంగా చంపవద్దని చెప్పినందుకు అక్కడి పులి, తోడేలు, ఎలుగు చేసిన గాయాలివి. అక్కడ ఉండలేక పారిపోయి వచ్చాను" అంది.

అంతలోనే అక్కడికి వచ్చిన కాకి, "నక్కలను నమ్మలేం" అంది.

"అయ్యో, నేను పూర్తి శాకాహారిని. నన్ను నమ్మండి" అంది నక్క.

"పాపం, అయితే ఇప్పుడు మేము కొంగ బావ ఇచ్చే చేపల విందుకు వెళ్తున్నాం. మీరు రాలేరన్నమాట" అంది కాకి.

"అదేం లేదు, వారంలో ఒకరోజు మాంసాహారం తింటాను. మిగిలిన రోజులు తినను. పదండి" అంటూ వాటితో బయలుదేరింది కారుణ్యం.

దారిలో కాకి, "కోయిలా, అడవి చివర గుహలో మన కుందేలు పిల్లల్ని పెట్టింది.

చిన్న పిల్లలు అవి. వాళ్లమ్మ ఉదయం ఆహారానికి వెళ్తే మధ్యాహ్నానికి గానీ రావడం లేదు. ఆ కూనలు ఎలా ఉంటున్నాయో కదా!" అంది.

ఆ మాటలు వింటున్న నక్క, 'ఓహో! గుహలో కుందేలు పిల్లలు ఉన్నాయన్నమాట. ఈ విందు అవగానే వాటి సంగతి చూడాలి' అనుకుంది.

కొత్తగా వచ్చిన నక్కకు కూడా చేపల పులుసు వడ్డించింది కొంగ.

తృప్తిగా తిన్నాయి అన్ని. తిరిగి బయలుదేరుతుంటే "చిన్న పనుంది, చూసుకొని వస్తా" అంటూ నక్క మరో నక్కకు

# కథ



వెళ్ళింది.

'నీ పని నాకు తెలుసులే' అనుకుంటూ కాకి కోయిల చెవిలో ఏదో చెప్పింది.

కాసేపటికి నక్క కాకి చెప్పిన గుహలోకి దూరి కుందేలు పిల్లల్ని వెతకసాగింది.

అప్పుడే దానికి గుహ ద్వారం పెద్ద రాయితో మూత పడటం గమనించింది. 'అయ్యా! తెలిసి తెలియక ఈ గుహలోకి దూరి చిక్కుకుపోయానే' అనుకుంది.

కాసేపటికి జంతువులన్నీ గుహ ముందుకు చేరాయి.

అప్పుడే ఆ పెద్ద రాయిని తొలగించింది ఏనుగు.

"కుందేలు పిల్లలు కనిపించాయా?" అని అడిగింది కోయిల.

"ఈ నక్క ఓ టక్కరి. దాని పేరు కారుణ్యం కాదు కుటిలం. పక్క అడవిలో జంతువుల మధ్య గొడవలు పెట్టి చిన్న జంతువులను చంపించుతోంది. దానితో రాజు దీన్ని కొట్టి అడవి నుండి తరిమేశాడు. అయినా దీని బుద్ధి మారలేదు. వచ్చిన రోజే మనతో అబద్ధాలు ఆడటమే కాకుండా కుందేలు పిల్లలు ఉన్నాయంటే ఇక్కడికి చేరింది" అంది కాకి.

దాంతో జంతువులన్నీ దానికి దేహశుద్ధి చేశాయి. ఆ అడవి నుండి కూడా బయటికి పరుగు తీసింది కుటిలం.

**-కూచిమంచి నాగేంద్ర .**

### బాల గేయం

## బాలల్లాల రండి

బాలల్లారా రారండి
బాధ్యత లెరిగి మెలగండి
తెలుగు భాషలో తీయదనాన్ని
తెలుపగపరుగునరారండి. !! బాల!!
అందమైనది,తీయనైనది
చక్కనైనది ,మనతెలుగు
భాషభావం భావితరాలకు
తెలుపగ పరుగునరారండి. !!బాల!!
కష్టమొచ్చినా బాధలొచ్చినా
తెలుగు న అమ్మాఅందాము
మమ్మీ ,షిట్టు అనేపదాలను
మరుగునపరచగరారండి
!!బాల!!
నీతికథలను నాగరికతలను
తియ్యని తెలుగులో అందిద్దాం
మనభావాలనుమనభాషలోనె
చక్కగతెలుపగ రారండి.
!!బాల!!
ప్రపంచభాషల్లోమనతెలుగును
ప్రథమ భాషగా నిలపెడదాం
ఆదారిలోన భావితరాలు
పయనించాలని ఆశిద్దాం
!!బాలల్లారారారండి. బాధ్యత లెరిగి మెలగండి!! 2

**-సి వి ఎస్ మహాలక్ష్మి**

## కథ



# ఎలుగుబంటి సాయం

అది ఒక అడవి అందులో అన్ని రకాల జంతువులూ,పక్షులూ ఉండేవి. అడవికి రాజు మృగరాజు.

ఎలుగుబంటికి వైద్యం తెలుసు. ఒక రోజు ఎలుగుబంటి రాజును కలిసి అన్ని జంతువులనూ సామావేశపరచమనికోరింది. మృగరాజు అలాగే చేసి 'ఇక విషయమేమిటో చెప్పు' అంది. 'రాజా!.. అడవిలో మూల మూల ప్రాంతాలకు వెళ్ళి ఔషధ మొక్కల ఆకులు తెచ్చి వైద్యం చేయడం వల్ల కాలయాపన జరుగుతోంది..ఇప్పుడు వర్షాలు కురుస్తున్నాయి

కాబట్టి ఆ మొక్కలను తెచ్చి మనం నివాసం ఉన్న చోట నాటి, అవి పెరిగేవరకు వాటి ఆలన పాలనా చూసుకోవాలిఅందుకు జంతువులన్నీ సహకరించాలి. ముఖ్యంగా నాకు కోతులు,జింకలు మొక్కలు తేవడానికి సులువుగా ఉపయోగపడతాయి' అని చెప్పింది ఎలుగుబంటి.

'ఎలుగు మామ చెప్పింది బాగుంది' అంది జింక. 'అలాగే.. ఎలుగుబంటికి సహకరించండి' అని చెప్పింది

మృగరాజు. ఎలుగుబంటి, కోతులను,జింకలను తీసుకెళ్లి నేల మీద మొలిచిన చిన్న చిన్న ఔషద మొక్కలను తీసి కోతులకు ఇచ్చింది. కోతులు వాటిని తీసుకుని జింకల పైన కూర్చుని జాగ్రతగా తెచ్చి వివాస ప్రాంతంలో ఒక చోట

చేర్చాయి. తరువాత ఎలుగుబంటి వాటిని ఎక్కడ నాటలో కోతులకు చెప్పింది. కోతులు ఎండిన కర్ర ముక్కలతో నేలను తవ్వి చిన్న చిన్న గుంతలను తీసి వాటిని నాటి మట్టితో కప్పాయి. అన్ని జంతువులూ ఆ మొక్కలను పెరిగేవరకు జాగ్రత్త చూసుకున్నాయి.

'రాజా..ఔషధ మొక్కలన్నీ బాగా పెరిగాయి. ఎలుబంటి మామ ఏ జబ్బుకు ఎలాంటి ఆకులు వాడాలో మాకు చక్కగా చెబుతోంది' అంది కుందేలు. 'నీవు ఔషధ మొక్కలను నాటించి ఎంతో మంచి సాయం చేశావు.. అంతే కాకుండా అందరికీ ఔషధం మొక్కల ఆకుల గురించి తెలియజేసినందుకు నీకు ధన్యవాదాలు' అని ఎలుగుబంటిని,మృగరాజు మెచ్చుకుంది.


'వైద్యం గురించి అందరికీ తెలియాలి మహారాజా' అంది ఎలుగుబంటి


. ★★★

# మెదడుకు మేత – 1



ఈ లెక్కల లెక్క తేల్చేయండి ......



# కథ



# దేవత వరం

అనగనగా రామా పురం అనే ఊరిలో రాము అనే అమాయకుడు ఉండేవాడు. రాము అమాయకంగా ఉండడంతో, మిగతా పిల్లలు, రాజు, రాణి లు ఎప్పుడూ రాముతో తమ పనులు చేయించుకునే వారు. అలాగే, రాముని ఆటపట్టించేవారు.

పాపం రాము ఎవ్వరు ఏమన్నా, తనలో తానే బాధ పడేవాడు గాని, ఎవరినీ ఏమీ అనేవాడు కాదు, అలాగే ఎవరు ఏం అడిగినా సాయం చేసేవాడు. ఒక రోజు రాము, ఉసిరి కాయలు కోసుకు రావడానికి అడవికి వెళతాడు.

అడవిలో చాలా దూరం నడుస్తూ వెళ్తుండగా, ఒక చెట్టు పైన పక్షి పిల్లలు అరుస్తూ ఉండటం చూసిన రాముకి, అక్కడ ఏం జరుగుతుందో అని చూద్దామని వెళ్ళగానే, ఆ చెట్టు పై ఒక పాము ఉంటుంది, అది ఆ పక్షి పిల్లలను తినడానికి వెల్తూ ఉంటుంది. వెంటనే రాము భయపడుతూనే, చెట్టు కొమ్మను విరిచి, కళ్ళు మూసుకుని ఆ కొమ్మతో పామును చెట్టుపై నుండి కిందకి తోసి వేస్తాడు.

రాము కళ్ళు తెరిచే సరికి, ఎదురుగా వనదేవత ప్రత్యక్షం అవుతుంది. వెంటనే రాము అమాయకంగా, “ఎవరు నువ్వు, ఈ అడవిలో ఒంటరిగా ఏం చేస్తున్నావు, పాపం నీకు ఇల్లు లేదా” అని అడుగుతాడు. దానికి వనదేవత నవ్వి, “ఈ అడవికి నేనే తల్లిని, ఈ చెట్లు, జంతువులు, పక్షులు అన్నీ నా పిల్లలు. నేను ఇక్కడే ఉంటాను” అని చెబుతుంది. వెంటనే రాము, “అయితే ఆ పక్షి పిల్లలను ఆ పాము తినబోతుంటే ఎక్కడికి వెళ్లావు కాపాడుకుండా” అని అడుగుతాడు. దానికి వనదేవత, “చెప్పాను కదా, జంతువులు కూడా నా పిల్లలే అని, అందుకే పాముకు హాని చేయలేదు, సరే గాని నువ్వు ఒంటరిగా ఈ అడవికి ఎందుకు వచ్చావు” అని అడుగుతుంది వన దేవత రాము ని.

వెంటనే రాము, “మా అమ్మ నన్ను ఉసిరి కాయలు తీసుకురమ్మని చెప్పింది, అందుకే అడవికి వచ్చాను, నాకు ఉసిరి కాయల చెట్టు ఎక్కడుందో చెప్తావా, నేను ఉసిరి కాయలు కోసుకున్నాక, నీకు కూడా కొన్ని ఇస్తాను, మా



అమ్మ ఆ ఉసిరి కాయలతో ఊరగాయ పెడుతుంది, నీకు ఆ ఊరగాయ ను కొంచెం తెచ్చి ఇస్తాను సరేనా" అని చెబుతాడు రాము. రాము మాటలు విన్న వనదేవత, ఆ మాటలకు ముచ్చట పడి, తన చేతులని పెద్దగా చేసి, రాముకి వెంటనే, బంగారు ఉసిరి కాయలను ఇస్తుంది.

వెంటనే రాము అయోమయంగా చూస్తూ, "ఉసిరి కాయలు పచ్చగా ఉంటాయి, ఈ రంగులో ఉండవు, ఇవి తినకూడదు. వీటిని తీసుకు వెళితే మా అమ్మ నన్ను కొడుతుంది" అని చెబుతాడు. వెంటనే వన దేవత మాములు ఉసిరికాయలతో పాటు, బంగారు ఉసిరికాయలను కూడా రాము కి ఇచ్చి, ఇంటికి తీసుకు వెళ్లి అడవిలో ఉండే అమ్మ ఇవి ఇచ్చిందని చెప్పి ఇవ్వు అని మాయమయి పోతుంది.

రాము ఆ ఉసిరి కాయలను తీసుకుని ఇంటికి వెళ్ళగానే, వాళ్ళ అమ్మ చూసి, బంగారు ఉసిరి కాయలు కూడా ఉన్నాయే, ఎక్కడివి అని అడగ్గా, రాము జరిగినదంతా వాళ్ళ అమ్మకి చెప్పడంతో చాలా సంతోషిస్తుంది.

**MORAL: మంచి పనులు చేస్తే అంతా మంచేజరుగుతుంది..**

**-పరవీణ్ నిజమాల**

## ముల్లా నసీరుద్దీన్ కథలు



# మీరు చెప్పింది నిజమే

. ఒకసారి ముల్లా తన సొంత ప్రయత్నంతో, తన సొంత పట్టణంలో న్యాయమూర్తి అయ్యాడు. ఊళ్ళోని అన్ని రకాల సమస్యలు అతని వద్దకు తీసుకొచ్చేవాళ్ళు .

సమస్యలు చర్చించబడినప్పుడు , తీర్పు ఇచ్చినప్పుడు ముల్లా కొడుకు పక్కనే ఉండేవాడు.ఒక రోజు ఒక సమస్య వచ్చింది.

“నీ గొప్పతనాన్ని నేను ఏమి చెప్పగలను? మనం బట్టలు కుట్టడానికి దర్జీ దగ్గరికి మాత్రమే వెళ్ళాలి. క్షురకుడి దగ్గర కాదు, నేను నిజమేనా? కాబట్టి, నేను ఈ దర్జీ దగ్గరికి వెళ్ళాను. అతను నా కోసం ఒక దుస్తులు తయారు చేసాడు, అందులో ఆశ్చర్యం లేదు! కానీ, సరదా ఏమిటంటే, నేను దుస్తులు ధరించిన తర్వాత నాలుగు అడుగులు కూడా నడవలేదు, అది ముక్కలుగా విడిపోయింది. ఎలా చెప్పాలో నాకు తెలియదు! నేను అలా చేయకపోతే, న్యాయం నాకు దక్కదు. కాబట్టి, నేను చెప్పాలి. నన్ను క్షమించు, నేను రోడ్డు మధ్యలో దారంతో నిలబడి ఉన్నాను. ప్రజలు మమ్మల్ని చూసి నవ్వరా? అలాంటి దర్జీ పనికి నేను ఈ వ్యక్తికి డబ్బు చెల్లించాల్సి వస్తే ఎలా చెప్పు?” అని ఫిర్యాదుదారుడు విలపించాడు.
“అవును నువ్వు చెప్పింది నిజమే!” అన్నాడు ముల్లా.

అది వింటూ, దర్జీ తన వైపు కథ చెప్పడానికి ముందుకు వచ్చాడు.నా ప్రభూ! అతను తెచ్చింది పాత గుడ్డ ముక్క. నేను దానిని కుట్టలేనని చెప్పాను. దానిని ఎలాగైనా కుట్టించాలని అతను కోరుకున్నాడు. నేను దానితో ఇబ్బంది పడ్డాను .ఈ వ్యక్తి ఓపికగా వేచి ఉండటానికి బదులుగా, నా స్వంత వృత్తిని నాకు నేర్పించడం ప్రారంభించాడు. అతని సూచనలతో నన్ను చంపాడు! అతని ఆటంకాల కారణంగా నేను నా వేళ్లను నాలుగుసార్లు పొడిచుకున్నాను. ఉత్తమంగా చెప్పాలంటే, దుస్తులు చిరిగిపోవడానికి నేను కారణం కాదు. నేను నా పని చేసాను. నాకు నా పరిహారం రావాలి.” అన్నాడు దర్జీ.

“అవును! మీరు చెప్పేది నిజమే!” అన్నాడు ముల్లా.

ఇద్దరూ మూగబోయారు.ముల్లా కొడుకు నెమ్మదిగా అక్కడికి వచ్చాడు.

“తండ్రీ! వారిద్దరూ నిజం చెప్పటానికి అవకాశం లేదు!” అన్నాడు.

“అవును! మీరు చెప్పింది నిజమే!” అన్నాడు ముల్లా .రెండవ ఆలోచన లేకుండా!★★

## కథ



# లివ్ అండ్ లెట్ లివ్

"ఉష్....ఉష్.. ఉష్" అంటూ రొప్పుతూ వచ్చింది నాగిని. "హమ్మయ్యా బతికి బయట పడ్డాను. చావు తప్పి కన్ను లొట్ట పోయింది పిన్నీ" అంది ఆయాసం తీర్చుకుంటూ.

"ముందు ఇలా కూర్చో. అంత పరుగెత్తుకు వచ్చే కష్టం ఏమొచ్చింది" అన్నది వాసుకి.

"వానలు తగ్గాయి కదా అని అలా గాలి పీల్చుకుందామని బయటికి వెళ్ళాను. అప్పటికీ గోడ వెంబడే నడుచుకుంటూ వెళుతున్నా! ఎప్పుడు చూశాడో ఆ మాలీ..కర్ర పుచ్చుకుని మీది మీదికి వచ్చాడు. ఇంతలో కాలికి రాయి తగిలి కింద పడ్డాడు. దొరికిందే సందు అని పరుగెత్తుకొచ్చాను" అంది నాగిని ..ఆయాసం తీర్చుకుంటూ!

"అవునే అమ్మా..ఈ మనుషులని ఎలా అంచనా వెయ్యాలో తెలియట్లేదు. మొన్నటికి మొన్న తినటానికి ఏమైనా దొరుకుతుందేమో అని మీ బాబాయ్ అలా పొలం దాకా వెళ్లారు. అక్కడికీ నక్కి నక్కి వెళ్ళారట. ఎలా చూశాడో కానీ, ఆ రైతు కర్ర పుచ్చుకొచ్చాడుట. ఇదిగో నువ్వు వచ్చినట్టే పరుగు పరుగున వచ్చారమ్మా" అన్నది వాసుకి.

"పది రోజుల క్రితం..'నాగుల చవితి' కి కోడి గుడ్లు, పాలు, అరటి పళ్లు, పువ్వులు పట్టుకొచ్చి మన ఇంటి చుట్టూ పక్కల నానా హంగామా చేశారా? వీళ్ళ భక్తి చల్లగుండ..వాళ్ళు వెలిగించిన దీపాల వేడికి తట్టుకోలేకపోయాను. ఆ అగరొత్తులు వాసనకి నాకు ఊపిరి ఆడలేదంటే నమ్ము. ఓ చేత్తో దణ్ణం పెట్టటం, మరోచేత్తో కర్ర తీసుకు కొట్టటం! ఆ భక్తికి సంతోషించాలా ఈ దాడికి బాధపడాలా" అన్నది మళ్లీ నాగిని.

"ఆ :( మీరు మాత్రం తక్కువ తిన్నారా? అసలు మమ్మల్ని బతకనిస్తున్నారా? కాస్త ధాన్యమో, ఇంకేదైనా జీవులో దొరుకుతాయని, మేము పొలాల్లో తిరుగుతుంటే, మీరు మమ్మల్ని లటుక్కున నోట్లో వేసుకుంటున్నారు. తప్పించుకు పారిపోతుంటే..మందు పెట్టో, బోన్లు పెట్టో ఈ మనుషులు వేటాడుతున్నారు. నాలుగు నెలల క్రితం.."మూషికవాహన గజాననా, మోదకహస్త గజాననా, పార్వతి తనయ గజాననా" అని పాటలతో హోరెత్తించి ఎక్కడలేని భక్తి ప్రదర్శించారు. అబ్బో వీళ్ళు మారారు..మనని పూజ చేస్తున్నారు అనుకునేసరికి ఇలా బోన్లు పుచ్చుకు తయారయ్యారు."

"నిజం చెప్పాలంటే ఈ మనుషులకి అసలు నీతి లేదు. వాళ్ళ రోగాలకు మందులు కనిపెట్టాలని..ప్రయోగశాలల్లో మనని ఎన్ని రకాలుగా హింసిస్తున్నారో! మన ప్రాణాలతో చెలగాటమాడి .. మన మీద ప్రయోగాలు చేసి, విద్దూరం కాకపోతే..అవి విజయవంతమైతే..వాళ్ల కోసం మందులు తయారు చేసుకుంటారుట. వాళ్ళు ఆరోగ్యంగా ఉండడానికి మందులు తయారు అవ్వాలంటే మన మీదే

# కథ



హింస!"

"వాళ్ల చేతుల్లో నించి తప్పించుకుని బయట పడ్డాం అని సంతోషం పడితే, మీరు ఫలహారం చేస్తారు. మీ నించి తప్పించుకు బయట పడ్డాం అని సంతోషించే లోపు మళ్లీ ఆ మనుషుల చేతనే విషం ప్రయోగించబడి చనిపోతున్నాం. ఇదెక్కడి న్యాయం? మన తరఫున అడిగే వాళ్ళు లేరనే కదా వాళ్ళ ధైర్యం! భగవంతుడు వాళ్ళని పుట్టించినట్టు మనని పుట్టించాడు కదా! మనకి బతికే హక్కు లేదా" అని అనిరుద్ధుడు వాపోయాడు.

తమ మిత్రులు అంతా ఏదో సభ పెట్టారు అని బల్లి, బొద్దింక, సాలె పురుగు కూడా వచ్చి తమ తమ స్థానాల్లో కూర్చున్నాయి. "మీకూ కష్టాలున్నాయా" అని అడిగింది వాసుకి.

"లేకేం పిన్నీ..సాలె పురుగులని తిని జీవనం సాగించే బొద్దింకలను..అదేదో 'హిట్టు' ట..అది కొట్టి చంపేస్తున్నారు. ఆ బొద్దింకలను తిని బతికే మాకు, అవి లేక పోతే ఆకలి ఎలా తీరుతుంది. ఇళ్లలో చెదలకు కొట్టే విషంతో మా బతుకు కూడా గందరగోళంలో పడింది. ఏం చెప్పమంటావు పిన్నీ" అంది బల్లి చెల్లి దీనంగా మొహం పెట్టి. "ఓహో మీ మీద కూడా దాడులు జరుగుతున్నాయా" అంది బల్లిని చూసి వాసుకి.

"నేను మొన్న ఒక ఇంట్లోకి వెళుతుంటే ఆ ఇల్లాలు మందు కొట్టేవాడిని పిలిచి.."బాబూ మా ఇంట్లో బల్లుల సంతతి ఎక్కువయింది. అవి కింద తిరుగుతుంటే పిల్లలు భయపడుతున్నారు. వాటికి కూడా ఏదైనా మందు ఉంటే కొట్టు" అని చెబుతున్నది.

"ఆ:( అంటే అతనేమన్నాడు" అంది.. ఉత్సుకతతో తల ముందుకి చాపి వాసుకి.

"బల్లి లక్ష్మీ దేవితో సమానం. వాటికి మందు కొట్టకూడదు. అవి వేసవి లో మాత్రమే వస్తాయి. మనిషి అలికిడి అయితే చాలు పారిపోతాయి" అని చెప్పాడు అంటూ బల్లి తల్లి "అతనికున్న బుద్ధి కూడా వీళ్ళకి లేదు" అన్నది.

"ఓ పక్కన..కొన్ని జీవాలు నశించిపోతున్నాయి. వాటిని కాపాడాలి అంటూ..కోట్ల రూపాయలతో జీవ వైవిధ్య సభలు నిర్వహిస్తారు. మరొక పక్కన మనని చంపటానికి రకరకాల విషాలు కనిపెడుతున్నారు. ఏమిటో ఈ మనుషులు?"

"దేవుడు తన సృష్టిలో భాగంగా మనందరినీ పుట్టించాడు. ఒక జీవికి మరొక జీవిని ఆహారంగా చేసి పరస్పరాశ్రయులని చేశాడు. మనిషి మాత్రం తన ఆహారం కోసం చెట్ల మీద, పంటల మీద ఆధారపడటం లేదా? మనం మాత్రం మన ఆహారం తినటానికి లేకుండా మందులు కొట్టి వాటిని నాశనం చేస్తున్నాడు" అని బల్లి చెబుతూ ఉండగా..

"మిత్రులారా మీకు కనీసం ఆకారాలు అయినా ఉన్నాయి. కంటికి కనిపించకుండా, గుట్టు చప్పుడు కాకుండా పంటలనాశ్రయించుకుని ఉన్న మమ్మల్ని ఘాటైన రసాయనాలను చల్లి చంపేస్తున్నారు. ఆ రసాయనాల మిగుళ్లు ఇంకా పంటల్లో ఉండిపోయి ఆ మనుషులకే ఇప్పుడు కొత్త కొత్త రోగాలు వస్తున్నాయట. మనుషుల తిక్క కుదిరింది" అని మొక్కలకి పట్టి తమ జీవనం సాగిస్తున్న దోమ తెగులు, పెను బంక, బూజు తెగులు గొంతు చించుకున్నాయి.

"ఆ:( ఆకారం ఉండటం, లేకపోవటం కాదు! మేము, ఈ మేకలు, ఆ గొర్రెలు..ఇంతంత ఆకారాల్లో ఉన్నాం..ఏం లాభం మమ్మల్ని బతకనిస్తున్నారా? సంతోషం వచ్చినా దుఃఖం వచ్చినా మేము వందలకి వందలు బలి అయి వాళ్ళకి విందు చేస్తున్నాం" అంటూ కోడి, మేక, గొర్రె కూడా సభకి వచ్చి తమ గోడు వినిపించాయి.

ఇక కుక్కలు, పిల్లులు, నెమళ్లు, ఆవులు..వాటి వధ నిషేధించినా పాపం అవీ బలి అవుతునేవున్నాయి.

స్వార్థంతో పర్యావరణాన్ని నాశనం చేస్తూ జీవ వైవిధ్యానికి విఘాతం కలిగిస్తున్న మనిషి ఎప్పుడైనా ఇతర జీవులు నిర్వహించే ఇలాంటి సమావేశంలో నడిచే సంభాషణ వినటం జరిగితే..తన తప్పు తెలుసుకుని కొంచెమైనా "లివ్ ఆండ్ లెట్ లివ్" అనే నినాదాన్ని గౌరవిస్తూ ప్రకృతి సమతుల్యత పట్ల శ్రద్ధావహిస్తాడనే ఆశతో ఈ కథ సృష్టిలోని అన్ని జీవరాశులకు అంకితమిస్తున్నాను.

దేవుడు అని కొలుస్తూ పాము పుట్టలో పాలు పోస్తాం. కానీ అవి కనపడగానే కొట్టి చంపుతాం..ఏమిటి ఈ విడ్డూరం

**-ఎం బిందుమాధవి**

# కథ



## నిజమైన సైన్యాధికారి!

పూర్వం విరాటపురం అనే సుందరమైన రాజ్యం ఉండేది. ఆ రాజ్యాన్ని పాలించే రాజు విక్రమార్కుడు ధైర్యం, న్యాయం, దయ కలిగినవాడిగా ప్రసిద్ధుడు.

ఒకరోజు రాజ్య సైన్యాధిపతి వృద్ధుడు అవుతున్నందు వలన తన పదవికి విరమణ చేయాలనుకున్నాడు. అప్పుడు రాజు తన మంత్రి విశ్వనాథుని పిలిచి,

"మన రాజ్యానికి తెలివైన, ధైర్యమైన, అలాగే మంచి మనసున్న సైన్యాధికారి కావాలి. సరైన వ్యక్తిని వెతకండి" అని ఆజ్ఞాపించాడు.

మంత్రి వెంటనే,

"సైన్యాధిపతి పదవికి అర్హులైన వారు విరాటపురానికి రేపు ఉదయం సభకు రావాలి" అని ప్రకటన వేయించాడు.

అనేక మంది యోధులు వచ్చారు. కానీ, అన్ని పరీక్షల తర్వాత చివరి దశకు ఇద్దరు మాత్రమే ఎంపికయ్యారు. ఒకరు వీరభద్రుడు, మరొకరు అర్జునుడు.

వీరభద్రుడు..బలమైన శరీరం, పదునైన ఖడ్గం, ఎన్నో యుద్ధ అనుభవాలు కలవాడు. అర్జునుడు మాత్రం శాంత స్వభావం, తక్కువ మాటలు, కానీ అపారమైన తెలివి కలవాడు.

చివరి పరీక్ష ఏంటో ఎవరికీ తెలియదు. మరుసటి రోజు ఉదయం మంత్రి ఇద్దరినీ ఒక చోటుకు తీసుకెళ్లాడు. అక్కడ ఒక చిన్న గ్రామం ఉంది. దానిని ఆనుకుని ఒక అడవి ఉంది. ఆ గ్రామంలో పిల్లలు ఆకలితో ఉన్నారు. ఇళ్లు కూలిపోతున్నట్టు కనిపిస్తున్నాయి. ఎవరి ముఖం లోనూ సంతోషం, ధైర్యం లేదు.

మంత్రి ఆ గ్రామాన్ని చూపించి,

"మీ ఇద్దరికీ ఒకరోజు గడువు ఇస్తున్నాను. మీ ముందున్న ఈ పరిస్థితిని చూసి మీరు ఏం చేస్తారో అదే మీకు చివరి పరీక్ష. రేపు నేను మళ్లీ ఇదే సమయానికి వచ్చి సైన్యాధికారి పదవికి ఎవరు తగిన వ్యక్తో నిర్ణయిస్తాను" అని మంత్రి చెప్పాడు.

# కథ



వీరభద్రుడు వెంటనే కోపంతో,

“ఇది కచ్చితంగా శత్రువుల పని అయ్యుంటుంది! నేను ముందుగా శత్రువులను ఓడిస్తాను” అని అతను ఖడ్గం తీసుకుని అడవిలోకి వెళ్ళిపోయాడు. ఆ రోజంతా అలానే కాలక్షేపం చేశాడు.

కానీ, అర్జునుడు మాత్రం గ్రామంలోకి వెళ్లి పిల్లలతో మాట్లాడాడు. పెద్దలను అడిగాడు. ఏడాది కాలంగా కరువు వల్ల పంట నష్టపోయిందని తెలుసుకున్నాడు. వెంటనే సమీప గ్రామాల నుంచి ఆహారం తెప్పించాడు. గ్రామస్తులతో కలిసి వంతెన కట్టించాడు. అడవిలోకి వెళ్లి ప్రమాదకరమైన మార్గాలను గుర్తించి, భద్రంగా మార్చాడు.

మరుసటి రోజు మంత్రి విశ్వనాథుడు, రాజు విక్రమార్కునితో కలిసి వచ్చాడు. వీరభద్రుడు, అర్జునుడితో పాటు అక్కడున్న వారందరూ కుతూహలంతో ఎదురు చూస్తున్నారు రాజు ఎవరి పేరు చెప్తారో అని.

చివరకు రాజు విక్రమార్కుడు,

“సైన్యాధికారి అంటే యుద్ధం మాత్రమే కాదు. ప్రజలను రక్షించడం, సమస్యను అర్థం చేసుకోవడం కూడా చాలా ముఖ్యము. భుజ బలంతో పాటు బుద్ధిబలం కూడా చూపించిన అర్జునుడే మన కొత్త సైన్యాధికారి.”

అలానే ఈ పోటీలో తుది దశకు చేరిన వీరభద్రుడిని కూడా మన సైన్యంలో  నియమిస్తున్నాను, అని చెప్పాడు.

వీరభద్రుడు తన తప్పును అర్థం చేసుకుని అర్జునుడితో కలిసి పనిచేయడానికి ముందుకు వచ్చాడు.

అలా విరాటపురం మరింత సురక్షితంగా, సంతోషంగా మారింది.

**నీతి: నిజమైన నాయకుడు బలం కన్నా బుద్ధిని, కోపం కన్నా కరుణను ఎక్కువగా ఉపయోగిస్తాడు.**

**-రోణంకి దివిజ సాయిభాను.**

## మన బాల గేయాలు

## ఒకటి ఒకటి ఒకటి

ఒకటి ఒకటి ఒకటి మానవులంతా ఒకటి

రెండు రెండు రెండు మంచి, చెడులు రెండు

మూడు మూడు మూడు మన జెండా రంగులు మూడు

నాలుగు నాలుగు నాలుగు వేదాలు మనకి నాలుగు

ఐదు ఐదు ఐదు చేతికి వేళ్ళు ఐదు

ఆరు ఆరు ఆరు రుతువులు మనకి ఆరు

ఏడు ఏడు ఏడు వారానికి రోజులు

ఏడు ఎనిమిది ఎనిమిది ఎనిమిది దిక్కులు,

మూలలు ఎనిమిది తొమ్మిది తొమ్మిది తొమ్మిది గ్రహాల
కూటమి తొమ్మిది

పది పది పది పాపలు పాడే పాట ఇది

# కథ



## పానకాల చెరువు

నందనం అనే అడవిలో పానకాల చెరువు ఉండేది. ఆ చెరువులో నీరు స్వచ్ఛంగా , తియ్యగా, చల్లగా ఉంటాయని పేరు ఉంది .ఎండాకాలంలో కూడా ఆ చెరువులో నీళ్లు నిండుగా ఉండేవి.

పానకాల చెరువుకి కొత్తగా ఎక్కడినుంచో

ఒక మొసలి వచ్చి చేరింది. నెమ్మదిగా చెరువుని సొంతం చేసుకుంది.అది

ఏ జంతువునూ, పక్షినీ చెరువులోని నీటిని ముట్టనిచ్చేది కాదు.

ఒకరోజు మిత్రుడు కోతిని, పానకాల చెరువుని చూడటానికి పక్క అడవిలో ఉండే

ఏనుగు బయలు దేరింది. కోతి తన అడవిలోని పానకాల చెరువు గురించి ఏనుగుకు గొప్పగా చెపుతుండేది.

పానకాల చెరువు

గట్టు పైన తియ్యటి మామిడి చెట్టు ఉండేది. ఆ చెట్టు.పైనే కోతి నివసించేది.

ఏనుగు నేరుగా పానకాల చెరువుకు చేరింది.

చెరువు గట్టు పైన కాలు పెట్టగానే జర్రు.. నజారి కింద పడింది. ఆ శబ్దానికి మామిడి చెట్టు పైన నిద్రిస్తున్న కోతి లేచి కూర్చుంది.

“మిత్రమా ! ఏమైంది !?” అంటూ సంబరంతో చెట్టు దిగి ఏనుగుని చేరుకుంది.

“ఇదేనా ! నువ్వు.ఎప్పుడూ గొప్పగా చెప్పే పానకాల చెరువు.దారిలో దాహం వేసినా, తాగకుండా నేరుగా ఇక్కడికే.వచ్చాను. చెరువు ఎండిపోయి బురదగా మారింది. చెరువుని పిచ్చి మొక్కలు కప్పి వేశాయి.ఏమైంది పానకాల చెరువుకు !?” అడిగింది మురికి నీటితోనే గొంతు తడుపుకుంటూ

ఏనుగు.

# కథ



" మిత్రమా ! చెరువులో ఉండే

మొసలి నీటిని ఎవరినీ త్రాగనివ్వదు, చివరికి అది ఎండిపోయింది. ఇప్పుడు చెరువులో చేపలు లేవు, పీతలు లేవు.తాబేలు, బాతులు చెరువుని వదిలేశాయి.జంతువులు, పక్షులు చెరువు దిక్కు రావటమే మానేశాయి. నీటిలో రాలి పడే మామిడి పండ్లు తిని బ్రతుకుతుంది !" అంది కోతి.

నలుగురికి దాహం తీర్చే చెరువుని కాపాడాలనుకుంది ఏనుగు.

ఇంతలో మొసలి కి ఆకలై మామిడి చెట్టు దగ్గరకు వచ్చింది. ఏనుగును చూసి

"ఎవరు నువ్వూ ! నా అనుమతి లేకుండా నీటిలో దిగావూ !".అంది నీరసంగా ఐక్క చిక్కిన మొసలి.

" మొసలి రాజా ! మీ గురించి,

పానకాల చెరువు గురించి గొప్పగా విని పక్క అడవి నుంచి వచ్చాను.కానీ, చెరువు వాడక పోవటంతో నీరంతా కాలుష్యమైంది.నీటిలో ప్రాణవాయువు తగ్గింది.చెరువంతా రాళ్లు రప్పలు

తేలాయి.చెత్త మొక్కలతో నిండి పోయింది. చెరువు ఎండి బురదగా మారింది! " అంది ఏనుగు.

"నిజమే ! ఈ చెరువు నీళ్లు తియ్యగా ఉండేవి. ఎండా కాలం కూడా ఎండేది కాదు!" అంది మొసలి.

"మొసలి రాజా ! చెరువు నీటిని వాడితేనే స్వచ్ఛంగా ఉంటాయి. చెరువుకు

నాలుగు జీవులు వస్తేనే నీకూ ఆహారం దొరుకుతుంది. ఇప్పటికే నీకు తిండి లేక బక్క చిక్కావు. ఇంకా ఇదే నీటిలో ఉంటే రోగాలొచ్చి చస్తావు !" అంది ఏనుగు.

మొసలి భయపడింది.

" మిత్రమా ! నా తప్పు తెలిసింది. ఏదైనా వాడకుంటే కొన్ని రోజులకు

పాడైపోయి,తన ఉనికినే కోల్పోక

తప్పదని గ్రహించాను. ఇక నుంచి ఈ చెరువు అందరిదీ !" అంది మొసలి.

అడవి జీవులు

మొసలిలో మార్పును చూసి, చెరువు వద్దకు తిరిగి రావడం ప్రారంభించాయి

అవి చెరురులో చెత్తను తీసి వేశాయి.ఏనుగు తొండంతో మట్టిని తీసింది. స్వచ్ఛమైన.


కొత్త నీరు వచ్చి చేరింది.

చెరువును పునరుద్ధరించినందుకు ఏనుగుకు కృతజ్ఞతలు తెలిపింది మొసలి. మొసలిలో మార్పు తెచ్చి చెరువుని కాపాడిన మిత్రుడు ఏనుగుని అభినందించింది కోతి.కొద్ది రోజులకే పానకాల చెరువు తిరిగి జీవులతో

కళకళలాడింది..

**-మహాంకాళి స్వాతి**

# పంచతంత్రంకథలు



## అల్లరి కోతి



. ఒకప్పుడు ఒక వ్యాపారి తన తోటలో గుడి కట్టడానికి చాలా మంది వడ్రంగులను మరియు తాపీ మేస్త్రీలను నియమించుకునేవాడు. వారు రోజూ ఉదయం పని ప్రారంభించి; మధ్యాహ్న భోజనానికి విరామం తీసుకుని, సాయంత్రం వరకు పనిని తిరిగి ప్రారంభించేవారు.

ఒక రోజు, ఒక కోతి గుంపు భవనం ఉన్న ప్రదేశానికి వచ్చి, కార్మికులు తమ మధ్యాహ్న భోజనానికి బయలుదేరుతుండగా చూస్తూ ఉండేది.

వడ్రంగులలో ఒకరు ఒక పెద్ద చెక్క దుంగను కోస్తున్నారు. అది సగం మాత్రమే పూర్తయినందున; దుంగ మూసుకుపోకుండా ఉండటానికి మధ్యలో ఒక చీలికను ఉంచాడు. తరువాత అతను తన భోజనం కోసం ఇతర కార్మికులతో కలిసి వెళ్ళా

# పంచతంత్రంకథలు

అందరు  కార్మికులు వెళ్లిపోయిన తర్వాత, కోతులు చెట్ల నుండి దిగి, ఆ స్థలం చుట్టూ దూకి, వాయిద్యాలతో ఆడుకోవడం ప్రారంభించాయి. వాటిలో ఒక కోతి ఉంది, దానికి దుంగ మధ్య ఉంచిన చీలిక చూసి ఆసక్తి కలిగింది.

అది దుంగ మీద కూర్చుని, సగం చీలిపోయిన దుంగ మధ్యలోకి





వెళ్లి, చీలికను పట్టుకుని లాగడం ప్రారంభించింది.


అకస్మాత్తుగా, చీలిక బయటకు వచ్చింది. ఫలితంగా, సగం చీలిపోయిన దుంగ మూసుకుపోయింది.

కాని దుంగ అంతరంలో కోతి తోక చిక్కుకుంది.

దానితో తోక బయటకు రాక కోతి చాల బాధపడింది .చివరకు రక్తం కారుతూ తీవ్రంగా గాయపడింది .

మిగిలిన కోతులకు గాయపడ్డ కోతిని ఏలే ఆడుకోవాలో అర్థం కాక చింతించాయి

.







# మంచి ఎవరు చెప్పినా వినాలి

ఉదయాన్నే ఒక రైతు ఇంట్లోని మచ్చుమీద పడుకున్న పిల్లి పిల్ల నిద్రలేచింది. పక్కన తల్లి ముగ్గురు చెల్లెళ్ళు నిద్రపోతున్నారు. సరదాగా ఒంటరిగా తిరగాలని అనిపించింది. హుషారుగా మచ్చుమీద నుండి నెమ్మదిగా కిందకి దిగింది. అలా నడుచుకుంటూ ఆ ఇంటి వెనకాల ఉన్న పశువుల పాకలోకి చేరింది.

అక్కడ కాసేపు నిలబడింది. చుట్టూ పరిశీలించింది. పాక చుట్టూ ఉన్న ప్రహరీ గోడ చూసింది. దానిపైకి ఎక్కాలని కోరిక కలిగింది. 'ఎలాగా?' అని చుట్టూ చూసింది. పక్కనే కుడితి తొట్టి కనపడింది. వెంటనే దాని మీద నుండి ప్రహరీ పైకి ఎగిరింది. తనొక్కతే అలా మొదటిసారి గోడ పైన తిరుగుతుంటే ఒళ్ళు ఆనందంతో పులకరించిపోయింది. చాలా సంబరంగా అనిపించింది. ముసిముసిగా నవ్వుకుంది.

ఇంకా పైకి ఎక్కితే బాగుండునని అనిపించింది. పైకి చూసింది. ఎత్తులో గుడిసె పైభాగం కనిపించింది. 'ఎలాగైనా సరే ఆ...పైకి ఎక్కవలసిందే!' అని మనసులో అనుకుంది. 'ఎలాగబ్బా?' అనుకుంటూ అటూ,ఇటూ చూసింది. గుడిసె పైదాకా కొయ్యలు కనిపించాయి. 'సాహసం చేయరా డింభకా!' అని మనసు చెప్పింది. ఇంక ఆగదలచుకోలేదు. వెంటనే ఒక కొయ్య పైనుండి నెమ్మదిగా పైకి చేరింది. అటూ ఇటూ గుడిసెపై నడవసాగింది.చాలా సరదాగా ఉంది.

'ఇంకా పైకి ఎక్కితేనో?!....' ఆలోచన వచ్చింది. పైకి చూసింది. ఆకాశం కనబడింది. కళ్ళు తిరిగినట్లయింది. క్రింద పడిపోబోయింది. భయమేసి, ''ఓ..ఓ...'' అని నిలదొక్కుకుంది. 'ఊ...శెభాష్, శెభాష్..' పడనందుకు మనసులో సంబరపడింది. తను చాలా పై....న ఉంది. 'అబ్బ! ఒక్క దాన్నే ఎంత పైకి ఎక్కానో?' అంటూ మురిసిపోయింది.గుడిసె పైన అటూ, ఇటూ కులుకుతూ పచార్లు చేయసాగింది. ఇంతలో ,'' ఒసేయ్! కింద పడ్డావంటే నడుములు విరుగుతాయి.'' అన్నట్లు ఓ కోడి కూత వినపడింది .ఆ కూతలు క్రింద నుండి వినబడ్డాయి. క్రిందకు తొంగి చూసింది. మరో తల్లికోడి, దాని పిల్లలు

# కథ



కనబడ్డాయి.

మరలా ఆ కోడి,'' ఏం! నీకు బతకాలని లేదా? పొద్దున్నే అంతపైకి ఎక్కావ్?'' అన్న భావంతో కొక్కొరోకో... అంటూ కోడి భాషలో కూస్తూనే ఉంది.

'' ఏయ్! ఏంటి? నన్ను తిడుతున్నావ్. మా అమ్మకు చెప్పానంటే, నీకు, నీ పిల్లలకు ఇక ఉంటది.'' అంటూ తనను తిట్టిందన్న కోపభావంతో కనుగుడ్లు ఉరుముతూ బెదిరించినట్టుగా పిల్లి భాషలో మాట్లాడింది. కోడికి దాని అరుపులో భావం అర్థం అయినట్లుంది. వెంటనే కూయడం ఆపింది. కానీ, పాపం! ఆ పిల్లి పిల్ల ఎక్కడ పడిపోతుందేమో?? నని జాలిపడింది. ఎలాగైనా కిందికి దింపాలనుకుంది. ''ఆ...ఆ... సరే సరే. చెబుదువులే. ముందు ఆ గుడిసె వైపు చూడు. అది మొన్ననే రెండు రోజుల క్రితమే వేసిన కొత్త జమ్ము గుడిసె. నువ్వేమో పైన కులుకుతున్నావు. ఆ గడ్డి జారుతుంది. పొరపాటున జారి పడ్డావో! ఇక నీ పని గోవిందా! మర్యాదగా ఎలా ఎక్కావో, అలా దిగిరా. లేకపోతే ఛస్తావ్ '' అన్న భావనతో మరలా పదే పదే తన కూతలతో హెచ్చరిస్తూ కూయసాగింది తల్లికోడి.

'' ఆ.. నేను ఒక్కదాన్నే ఎక్కాను తెలుసా? ఎందుకు పడతా? కావాలంటే చూడు డ్యాన్సు కూడా వేస్తా.'' అని, '' మ్యావ్... మ్యావ్... జింక్ చక జింగ్... అహ... జింక్ చక జింగ్.. అన్న భావంతో గెంతులు వేయడం మొదలు పెట్టింది పిల్లి పిల్ల.

' చెబితే అర్థం చేసుకునేలా లేదే ఇది. ఏం చెయ్యాలబ్బా?' అనుకుంటూ, ''నాకు కుళ్ళు లేదు, ఏంలేదు గానీ, చెప్పేది విను. మర్యాదగా కిందికి దిగు. నీ మంచికే చెబుతున్నా. ఆ జమ్ము జారుతుంది.'' అన్నట్లుగా గట్టిగా కొక్కొ...రో..కో.. అంటూ పెద్ద శబ్దంతో కూయసాగింది.

'' నేం దిగను... ఇక్కడ నాకు బాగుంది...హై హై డింకు చక, డింకు చక...'' అన్నట్లు ఎగురుతుండగా... కాలు జారింది. అంతే. సర్రున కిందికి జారుతూ, 'ఓ..ఓ..ఆ..ఆ...' అనుకుంటూ 'దభీమని' కింద పడింది.

కోడి కూత ఆపి బిత్తరపోయి నోరు తెరిచి ,''క్కొ..క్కొ..క్కొ...'' అంటూ చిన్న కూతతో గాభరాగా చూడసాగింది. ఇంతలో... ఇదంతా ముందు నుంచే మరో పక్కనుండి గమనిస్తున్న ఒక కుక్క దానిని లటుక్కున నోట కరుచుకుంది. మెరుపు వేగంతో కోడి కుక్కపైకి ఎగిరి దూకింది. కాళ్ళతో తన్నింది. గోళ్ళతో రక్కింది. ఊహించని ఈ పరిణామానికి బిత్తరపోయిన ఆకుక్క ఆ బాధ భరించలేకపోయింది. '' ఎవరితోనైనా పెట్టుకోవచ్చు గానీ, పిల్లలున్న తల్లి కోడితో పెట్టుకోకూడదురా బాబోయ్!'' అనుకుని, 'బ్రతుకు జీవుడా!' అనుకుంటూ పిల్లి పిల్లను వదిలేసి తోక ఊపుకుంటూ పారిపోయింది.

ఇవన్నీ కొద్ది క్షణాల్లో జరిగిపోయాయి. ఊహించని ఈ సంఘటనతో బెంబేలెత్తిపోయిన పిల్లి పిల్లకు మైకం కమ్మినట్లు అయ్యింది. కాసేపటికి తేరుకుంది. కానీ, కుక్క నోటి పళ్ళ గీతలతో కొద్దిగా బాధగా అనిపించింది. కనీసం ,'మ్యావ్' అనడానికి కూడా నోరు రాలేదు. ముదుచుకుని చిన్నగా ఎలాగోలా తల్లి దగ్గరకు చేరుకుని ఒళ్ళో ఒదిగి పడుకుంది. నిద్రలోకి జారుకుంది.

**-మద్దిరాల శ్రీనివాసులు**

# సైన్స్ కథలు ..



## సర్ సి వి రామన్

ఆధునిక భారతీయ విజ్ఞాన శాస్త్రవేత్తల పరిశోధనా ప్రతిభను అంతర్జాతీయస్థాయిలో ఇనుమడింపజేసిన వ్యక్తుల్లో సర్ సీవీ రామన్ (CV Raman) అగ్రగణ్యుడు. వైజ్ఞానిక ఆవిష్కరణల్లో భారతీయులకు నోబెల్ (Nobel) రావడం గగనం.. అలాంటిది సర్ సీవీ రామన్ ఆ ఘనత సాధించి సరికొత్త చరిత్రను లిఖించారు. అంతేకాదు, భౌతిక శాస్త్రంలో నోబెల్ ( Physics Nobel) అందుకున్న మొట్టమొదటి ఆసియా వాసిగా రికార్డు నెలకొల్పారు. పరిశోధనల కోసం భారతీయులు విదేశాలకు వెళ్లడమేంటి?. విదేశీయులే.. పరిశోధనల కోసం ఇక్కడకు రావాలని చాటి చెప్పిన మహోన్నత వ్యక్తి రామన్.

సీవీ రామన్ ముందు వరకూ సైన్స్‌లో నోబెల్ బహుమతులు పాశ్చాత్య దేశాలకు చెందిన శాస్త్రవేత్తలకే దక్కేవి. కానీ, రామన్ అచ్చమైన భారతీయునిగా (Indian) ఈ గడ్డపైనే చదువుకుని, తలమానికమైన పరిశోధనలు జరిపి సైన్స్‌లో దేశ శక్తిసామర్థ్యాలను ప్రపంచానికి తెలియజేసి.. భారత్‌కు నోబెల్ సాధించిపెట్టారు. 'నా మతం సైన్సు.. దానినే జీవితాంతం ఆరాధిస్తా..' అని చెప్పి తుదిశ్వాస వరకూ శాస్త్రాన్వేషణలోనే గడిపిన దార్శనికుడు ఆయన.

సీవీ రామన్‌గా పేరుగాంచిన ప్రముఖ భౌతికశాస్త్రవేత్త చంద్రశేఖర్ వెంకటరామన్.. 1928 ఫిబ్రవరి 28న రామన్ ఎఫెక్ట్ ను కనుగొనడంతో ఆ రోజును జాతీయ సైన్స్ దినోత్సవంగా (National Science Day) జరుపుకుంటున్నాం. భౌతికశాస్త్రంలో రామన్ చేసిన అపారమైన సేవలకు గుర్తింపుగా ఆయన గౌరవార్థం రామన్ ఎఫెక్ట్ కనుగొన్న రోజును జాతీయసైన్స్ దినంగా భారత ప్రభుత్వం ప్రకటించింది.1888 నవంబరు 7న తమిళనాడులోని తిరుచిరాపల్లిలో చంద్రశేఖర్ అయ్యర్, పార్వతి అమ్మాళ్ దంపతులకు రామన్ జన్మించారు. విశాఖపట్నంలో ప్రాథమిక విద్యను పూర్తిచేసిన రామన్ చిన్ననాటి నుంచే విజ్ఞాన శాస్త్ర విషయాలపై అమితమైన ఆసక్తిని ప్రదర్శించేవారు. తండ్రి కూడా భౌతికశాస్త్ర ఉపాధ్యాయుడు కావడంతో దానిపై ఆయన మరింత కుతూహలం పెంచుకున్నారు. తెలివైన విద్యార్థిగా పేరు తెచ్చుకున్న రామన్ 12 ఏళ్లకే మెట్రిక్యులేషన్ పూర్తి చేసి ఫిజిక్స్‌లో బంగారు పతకాన్ని సాధించారు. ఆ తర్వాత

# సైన్స్ కథలు ..



మద్రాస్ యూనివర్సిటీ నుంచి భౌతిక శాస్త్రంలో యూజీ, మాస్టర్స్ డిగ్రీ పూర్తిచేసి ఆ సబ్జెక్టులోనూ గోల్డ్ మెడల్ సాధించిన తొలి వ్యక్తిగా చరిత్ర సృష్టించారు.

పద్దెనిమిదేళ్ల వయసులో కాంతికి సంబంధించిన ధర్మాలపై రామన్ రాసిన పరిశోధనా వ్యాసాలు లండన్ నుంచి వెలువడే సైన్స్ జర్నల్ ఫిలసాఫికల్ మేగజైన్‌లో ప్రచురితమయ్యాయి. పరిశోధనల పట్ల ఆయనకున్న అభిరుచిని గమనించిన అధ్యాపకులు ఇంగ్లాండు వెళ్లాలని సలహా ఇచ్చారు. అయితే ప్రభుత్వం నిర్వహించిన వైద్య పరీక్షలో ఇంగ్లాండు వాతావరణానికి ఆయన ఆరోగ్యం సరిపడదని తేల్చడంతో ప్రయాణాన్ని విరమించుకున్నారు. ఆ తర్వాత ఫైనాన్స్ విభాగంలో ఉద్యోగిగా చేరిన సీవీ రామన్ 1907లో బాధ్యతల రీత్యా కలకత్తాకు బదిలీ అయ్యారు.

అక్కడ ఇండియన్ సైన్స్ అసోసియేషన్‌కు రోజూ వెళ్లి పరిశోధనలు చేసేవారు. రామన్ ఆసక్తిని గమనించిన కలకత్తా విశ్వవిద్యాలయం వైస్-ఛాన్సలర్ అశుతోష్ ముఖర్జీ.. నాటి బ్రిటీష్ ప్రభుత్వానికి లేఖ రాశారు. రామన్ పరిశోధనలను పూర్తి కాలానికి వినియోగించుకుంటే బాగుంటుందని ఆ లేఖలో సూచించారు. అయితే బ్రిటీష్ ప్రభుత్వం దీనికి అంగీకరించలేదు. దీంతో ఉద్యోగానికి రాజీనామా చేసిన రామన్ పరిశోధనలపై పూర్తిస్థాయి సమయాన్ని వెచ్చించారు.ఆ తర్వాత తల్లిదండ్రుల కోరిక మేరకు ఐసిఎస్ పరీక్షల్లో ఉత్తీర్ణులై కలకత్తా ప్రభుత్వ ఆర్థికశాఖలో డిప్యూటీ అకౌంటెంట్ జనరల్‌గా చేరారు. ఒకసారి కలకత్తాలో వీధుల్లో తిరుగుతుండగా బౌబజారు స్ట్రీట్ దగ్గర ఇండియన్ అసోసియేషన్ ఫర్ కల్టివేషన్ ఆఫ్ సైన్స్ అనే బోర్డు చూశారు. ఆ సంస్థ కార్యదర్శి డాక్టర్ అమృతలాల్ సర్కార్‌ను కలిసి పరిశోధన చేయడానికి అనుమతిని పొందారు.

రామన్ తల్లి పార్వతి అమ్మాళ్ వీణను అద్భుతంగా వాయించేవారు. అందుకే రామన్ తొలి పరిశోధనలు వయొలిన్, వీణ, మృదంగం లాంటి సంగీత వాయిద్య పరికరాలపై సాగింది. విజ్ఞాన పరిశోధనలపై తృష్ణతో ఉద్యోగానికి రాజీనామా చేసి కలకత్తా యూనివర్సిటీలో ఫిజిక్స్ ప్రొఫెసరుగా చేరారు. తాను అధ్యయనం చేసిన సంగీత పరికరాల శబ్ద రహస్యంపై 1921లో లండన్‌లో ఉపన్యాసాలు ఇచ్చారు. శ్రోతల్లోని ఓ వ్యక్తి ఇలాంటి అంశాలతో రాయల్ సొసైటీ సభ్యుడవుదామని భావిస్తున్నావా అంటూ హేళన చేశాడు. దీంతో రామన్‌కు పరిశోధనలపై మరింత పట్టుదల పెరిగింది. శబ్దశాస్త్రం నుంచి తన పరిశోధనలను కాంతివైపు మళ్లించారు. ఇంగ్లాండు నుంచి తిరిగొస్తూ ఓడలో ప్రయాణిస్తున్నప్పుడు

# సైన్స్ కథలు ..



ఆకాశం, సముద్రం నీరు రెండూ నీలిరంగులో ఉండటాన్ని ఏంతో ఆసక్తితో గమనించాడు. అప్పటిదాకా అనుకుంటున్నట్లు సముద్రపు నీలం రంగుకు కారణం ఆకాశపు నీలిరంగు ప్రతిబింబంగా ఏర్పడటం కాదని.... సముద్రపు నీటి గుండా కాంతి ప్రవహించేటప్పుడు కాంతి పరిక్షేపణం చెందడమే కారణమని ఊహించాడు. కలకత్తా చేరుకోగానే తన ప్రాకల్పనలను నిరూపించడానికి ద్రవాలు, వాయువులు, పారదర్శక ఘనపదార్థాల కాంతి పరిక్షేపణం గురించి పరిశోధనలు చేశారు. ఈ పరిశోధనలో యువశాస్త్రవేత్తలైన కె.ఆర్.రామనాథన్, కె.యస్ .కృష్ణన్ ఆయనకు అండగా నిలిచారు. 1927 ఏడాదికి భౌతికశాస్త్ర విభాగంలో నోబెల్ బహుమతి పొందిన కాంప్టన్ ఎక్స్ కిరణాలు పరిశోధన నిజమైనపుడు, కాంతి విషయంలోనూ అది నిజం కావాలంటూ ఆలోచనలో పడ్డాడు.

ఆ ఆలోచనే రామన్ ఎఫెక్ట్‌కు దారితీసింది. అధునాతనమైన పరికరాలు లేకపోయినా తన ఆలోచనకు ప్రయోగ రూపంలో జవాబు లభిస్తుందని నమ్మకంగా ఉన్న రామన్ అనుకున్నట్లుగానే 1928 ఫిబ్రవరి 28 న రామన్ ఎఫెక్ట్‌ను కనుగొన్నారు. పారదర్శకంగా ఉన్న ఘన, ద్రవ, వాయు పదార్థాల గుండా కాంతి ప్రసరించినప్పుడు అది తన స్వభావాన్ని మార్చుకుంటుందని రామన్ ఎఫెక్ట్ ద్వారా నిరూపించారు. ఈ దృగ్విషయాన్ని 1928 మార్చి 16న బెంగుళూరులో జరిగిన శాస్త్రజ్ఞుల సదస్సులో వెల్లడించారు.

నాటి బ్రిటీష్ ప్రభుత్వం 1929లో నైట్ హుడ్ బిరుదుతో రామన్ ను సత్కరించింది. రామన్ ఎఫెక్ట అసామాన్యమైందని కేవలం రూ.200 కూడా విలువలేని పరికరాలతో దృగ్విషయ నిరూపణ జరగడం అద్భుతమైందని ప్రపంచ శాస్త్రజ్ఞులందరూ కొనియాడారు. ఈ పరిశోధనను గుర్తించిన రాయల్ స్వీడిష్ అకాడమీ భౌతికశాస్త్రానికి 1930లో నోబెల్ బహుమతి ప్రధానం చేసింది. సైన్స్‌కు రామన్ చేసిన సేవలకు గుర్తుగా భారత ప్రభుత్వం ఆయనకు 1954లో దేశ అత్యున్నత పౌర పురస్కారం భారతరత్నతో సత్కరించింది. చివరి వరకు భారతదేశంలో సైన్స్ అభివృద్ధికి పాటుపడ్డ సీవీ రామన్ 1970 నవంబర్ 21న కన్నుమూశారు.

అత్యంత ప్రజ్ఞాశాలిగా గుర్తింపు పొందిన రామన్‌ను 1924లో ఇంగ్లండ్ రాయల్ సొసైటీ సభ్యత్వం.. 1928లో సర్ బిరుదు దక్కింది. ప్రతిష్ఠాత్మకమైన ఫ్రాంక్లిన్ మెడల్ కూడా 1947లో లభించింది. సి.వి. రామన్ రామన్ ఎఫెక్ట్ కనుగొని ప్రపంచాన్ని సంభ్రమాశ్చర్యాలలో ముంచెత్తారు. తన అనన్య సామాన్య పరిశోధనా సామర్థ్యం, ప్రతిభతో భౌతిక శాస్త్రంలో రామన్ ఎఫెక్ట్ కనుగొని చరిత్ర సృష్టించిన ఫిబ్రవరి 28 నే జాతీయ సైన్స్ దినోత్సవంగా జరుపుకొంటున్నాం

.★★★★★★★



ఆచార్య ఇరపని మాధవి

# చిత్ర గ్రీవుని తెలివి

గోదావరీ తీరంలో పెద్ద బూరుగు చెట్టు ఉంది. ఆ చెట్టుపై అన్ని దిక్కుల నుంచి వచ్చిన పక్షులు రాత్రులు నివసిస్తుంటాయి. ఒకరోజు ఉదయాన్నే లఘుపతనకమనే కాకి మేల్కొని అక్కడ తిరుగుతున్న వేటగాడిని చూసింది. “ఉదయాన్నే వీడి ముఖం చూశాను, ఏమి ఆపద వస్తుందో, వీడున్న దగ్గర ఉండకూడదు, ఆలశ్యం చేయకుండా ఇక్కడ నుండి వెళ్లిపోవాలి” అనుకుంది. అప్పుడు ఆ వేటగాడు ఆ చెట్టు దగ్గరలో నూకలు చల్లి వాటిపై వలపన్ని దగ్గరలోనున్న పొద వెనుక దాక్కొని చూస్తున్నాడు.

చిత్రగ్రీవుడనే పావురాల రాజు ఆకాశంలో ఎగురుతూ ఆ నూకలను చూసి తన తోటి పావురాలతో “ఎవరూ లేని ఈ అడవిలోకి నూకలెలా వచ్చాయి, మనం ఈ నూకల కోసం ఆశ పడకూడదు” అంటూ ’పులి– కంకణం–బాటసారి’ కథ చెప్పింది. ఇంకా “అన్నివిధాలుగా ఆలోచించే ఏ పనైనా చెయ్యాలి, ఆలోచించి చేసిన పని వల్ల హాని జరుగదు” అని చెప్పింది. ఆ మాటలు విన్న ఒక ముసలి పావురం “ఇవేం మాటలు, ఒక కష్టం వస్తే పెద్దవారైన ముసలివారి మాట వినాలి కదా! ప్రతి దానికి సందేహపడకూడదు. పనికిరాని అనుమానాలతో దొరికిన ఆహారం వదులుకొని ఎలా బ్రతుకగలం? “అనగా పావురాలన్నీ నేల మీదకు దిగి వలలో చిక్కుకున్నాయి.

అప్పుడు మిగిలిన పావురాలన్నీ ఆ ముసలి పావురాన్ని చూసి “నీవన్నీ తెలిసినవాడివని నీ మాట విని ఈ కష్టం తెచ్చుకున్నాం. ఎవరు బుద్ధిమంతుడో వాడు పెద్దగాని, వయసు మీరినవాడు పెద్దకాదు “ అని నిందించాయి. అది విని చిత్రగ్రీవుడు “ఇది ఇతని తప్పు కాదు, ఆపదలు రావాలనున్నప్పుడు మంచి కూడా చెడవుతుంది. మన కాలం మంచిది కాదు.

ఊరికే ఎందుకు అతడిని నిందించటం. తనకు తోచింది తను చెప్పాడు. మన బుద్ధి ఏమైంది? ఆపద వస్తే తప్పించుకునే మార్గం గురించి ఆలోచించాలి కానీ ఈ

# నీతి చంద్రిక కథలు

మాటల వల్ల లాభమేముంటుంది. ఇప్పుడు ధైర్యం తెచ్చుకొని ఏమి చేయాలో ఆలోచించండి. నాకైతే ఒకటే అనిపిస్తుంది మనమందరం ఒక్కసారిగా వలనెత్తుకొని ఎగిరిపోదాము. మనం అల్పులము, మన వల్ల ఈ పని అవుతుందా అని సందేహించవద్దు. అందరం ఐకమత్యంగా ఉంటే ఎంతటి పనైనా చేయవచ్చు. గడ్డిపరకలన్నీ కలిసి తాడుగా ఏర్పడి మదపుటేనుగును బంధించటం లేదా? ఇది కాకుండా మీకేమైనా ఉపాయం తడితే అదే చేద్దాం" అన్నాడు.

అదే సరైనదని పావురాలన్నీ కలిసి ఒక్కసారిగా ఎగిరి ఆకాశమార్గంలో పోవటం ప్రారంభించాయి. అది చూచి వేటగాడు 'ఈ పక్షులు గుంపుగా వల ఎత్తుకొని పోతున్నాయి. ఇవి నేల మీద వాలగానే పట్టుకుంటాను' అని వాటినే చూస్తూ వాటి వెంటే నేల మీద పోతున్నాడు. కొంత సేపటికి ఆ పక్షులు కనిపించకుండా దూరం పోగా నిరాశతో తిరిగి వెళ్లిపోయాడు. ఈ వింత చూడాలని వాటి వెనుకే కాకి వెంబడించి పోతుంది.

పక్షులన్నీ చిత్రగ్రీవుడిని మనం ఇప్పుడు ఏమి చేయాలని అడిగాయి. దానికి చిత్రగ్రీవుడు "లోకంలో తల్లి, తండ్రి, స్నేహితులు మాత్రమే మన మేలు కోరేవారు. మిగిలిన వారందరూ అవసరాన్ని బట్టి హితులవుతున్నారు. కాబట్టి నాకొక స్నేహితుడున్నాడు. అతడు హిరణ్యకుడనే ఎలుకల రాజు. గండకీ నదీ తీరంలోని విచిత్రవనంలో ఉంటాడు. అతడు తన పండ్ల బలంతో వల తాళ్లు కొరికి మన కష్టం పోగొడతాడు. అక్కడికి వెళదాం "అని చెప్పాడు. సరేనని పావురాలన్నీ హిరణ్యకుడి కలుగు దగ్గర వాలాయి. ఆ శబ్దానికి అతడు భయపడి కలుగులో దాక్కున్నాడు.

అప్పుడు చిత్రగ్రీవుడు కలుగు దగ్గరకు వచ్చి "ఓ స్నేహితుడా! మాతో ఎందుకు మాట్లాడవు " అనగానే ఆ గొంతు గుర్తుపట్టి వెంటనే బయటకు వచ్చాడు. "ఆహా! ఏమి నా అదృష్టం. నా ప్రియమిత్రుడు నా కళ్లకు ఆనందం కలిగిస్తున్నాడు" అంటూ బయటకు వచ్చాడు. వలలో చిక్కుకున్న పావురాలను చూసి ఇదేమని అడిగాడు. దానికి చిత్రగ్రీవుడు "ఇది మా కర్మఫలం, అనుభవించక తప్పద"ని చెప్పాడు. హిరణ్యకుడు చిత్రగ్రీవుడి బంధాలను తెంచబోగా "ముందు నన్ను ఆశ్రయించుకున్న వీరి బంధాలు తెంచు" అని చిత్రగ్రీవుడు అన్నాడు. దానికి హిరణ్యకుడు "నా దంతాలు చాలా కోమలమైనవి, అందరి బంధాలు తెంచలేను, ముందు నీ బంధం తెంచుతాను, తర్వాత శక్తి ఉన్నంతవరకు మిగిలిన వారి బంధాలు




తెంచుతాను" అన్నాడు . చిత్రగ్రీవుడు దానికి "శక్తికి మించి ఎలా చేయగలవులే, నీ శక్తి కొలది ముందు వీరి బంధాలే తెంచు, తర్వాత నా సంగతి ఆలోచించవచ్చు "అన్నాడు. దానికి హిరణ్యకుడు "తనకు మాలిన ధర్మం పనికిరాదు, మొదలు చెడ్డ బేరం కలదా ఆ లోకోక్తి విన్నావు కదా! తాను బ్రతికి కదా సమస్త పురుషార్థాలు సాధించుకోవాలి, తానే పోయిన తర్వాత దేనితోనైనా పనేముంటుంది" అన్నాడు. దానికి చిత్రగ్రీవుడు "నీవు చెప్పిన నీతి కాదనను, కానీ నా వారి కష్టం చూడలేను.

నావంటివారు వీరు, వీరివంటి వాడను నేను, వీరిని క్షించలేకపోతే నా పాలన వ వీరికి జరిగే మేలేముంది. అసహ్యామై అశాశ్వతమైన నా శరీరం గురించి ఆలోచమాని నన్నే సేవిస్తున్న వీరిని రక్షించు"అన్నాడు. ఆ మాటలకు సంతోషించిన హిరణ్యకుడు నీ ఆశ్రిత వాత్సల్యం మెచ్చుకోదగింది అంటూ అందరి బంధాలను కొరికివేశాడు. వారందరికీ ఎంతో ప్రేమతో ఆతిధ్యం ఇచ్చి వారిని సాగనంపాడు.

ఈ చిత్రగ్రీవుడి కథ మనకు "మంచి మిత్రులను సంపాదించుకోవాలి, అనవసరంగా దేనికి ఆశపడకూడదు, ఆపద కలిగినప్పుడు ఇతరులను నిందించటం మాని ఉపాయం ఆలోచించి బయటపడాలి, ఐకమత్యంగా ఉంటే ఎంత కష్టమైన పనినైనా సాధించవచ్చు, మనలని నమ్ముకున్న వారిని రక్షించాలి, నాయకుడైనవాడు స్వార్థం విడిచి ప్రజల మేలు కోరాలి" అనే సందేశాన్ని అందిస్తుంది.

# రోబో కథలు




## రాము - రోబో



రాము ఒకరోజు తన రోబో స్నేహితుడితో కలసి జంతు ప్రదర్శన శాలకు వెళ్ళాడు

అక్కడ రక రకాల జంతువులు రాముకు కనపడ్డాయి .

జంతు ప్రదర్శన శాల అంటే అక్కడ సింహాపు ఏనుగులు జింకలు పులు లు ఇలా అనేక జంతువులు బోనులో పెట్టి ఉంటాయి .వాటిని మనం తిలకించవచ్చు .

# రోబో కథలు



రాము వాటిని ఎప్పుడు చూడలేదు , చాల వింతగా అనిపించింది ఆ అనుభవం .

ఉన్నట్టుండి ఒక సింహం అక్కడి బోను లోనుండి బయటపడి అందరి మీదకు దూకింది .

దానితో అందరు భయపడి పరుగెత్త సాగారు

కాను రాము స్నేహితుడు రోబో మాత్రం ధైర్యంగా సింహాన్ని ఎదుర్కొన్నాడు





రోబో సింహం తో వీరోచితంగా పోరాడి చివరకు దాని చంపేసింది . దానితో అందరు సంతోసహించి , రాముకు , రోబో కు కృతజ్ఞతలు తెలిపారు

# విక్రమార్కభేతాళకథలు






## హోళిక

పట్టువదలని విక్రమార్కుడు మరలా స్మశానం చేరుకుని చెట్టుపైన ఉన్న బేతాళుని బంధించి తనభుజంపైన చేర్చుకుని మౌనంగా నడవసాగాడు.

శవాన్ని ఆవహించిఉన్నబేతాళుడు "భళా విక్రమార్క నీపట్టుదల మెచ్చదగినది. నాకు హోలిక గురించి తెలుసుకోవాలనిఉన్నది సకలకళావల్లభుడవైన నీవు నాకు తెలియజేయి తెలిసిచెప్పకపోయావో మరణిస్తావు "అన్నాడు.

" బేతాళా హోలికా దహన్ (హోలికా దహనం ) యొక్క పురాణం పాపంపై ధర్మం యొక్క విజయాన్ని సూచిస్తుంది. రంగుల పండుగ అయిన హోలీకి ముందు రోజు రాత్రి జరిగే వార్షిక భోగి మంటలతో హోలిక సంబంధం కలిగి ఉంటుంది .

హిందూ పురాణాల ప్రకారం , హిరణ్యకశిపు అనే రాజు , చాలా మంది అసురుల వలె , అమరుడిగా ఉండాలని కోరుకున్నాడు. ఈ కోరికను తీర్చడానికి, అతను బ్రహ్మచే వరం పొందే వరకు అవసరమైన తపస్సును చేసాడు . ఆ వరం హిరణ్యకశిపునికి అతని ఐదు కోరికలను ప్రసాదించింది: అతను బ్రహ్మచే సృష్టించబడిన ఏ జీవి చేతిలోనూ మరణించడు, అతను లోపల లేదా వెలుపల, పగలు లేదా రాత్రి, ఏ ఆయుధం ద్వారా, భూమిపై లేదా ఆకాశంలో నశించడు. మనుష్యులు లేదా మృగాలు,

# భేతాళ కథలు



దేవతలు లేదా అసురులు, అతను అసమానుడు అని, అతను అణచివేయని శక్తిని కలిగి ఉంటాడని మరియు అతను సమస్త సృష్టికి ఒక పాలకుడు అని. అతని కోరిక మన్నించి, హిరణ్యకశిపుడు అజేయంగా భావించి, సింహాసనాన్ని అధిష్టించి మూడు లోకాలను జయించాడు.

ఇంద్రుడు  అతను తన ఆధిపత్యాన్ని వ్యతిరేకించే వారందరినీ శిక్షించి చంపాడు. అతని కుమారుడు ప్రహ్లాదుడు , వైష్ణవుడిని పెంచాడు , తన తండ్రిని దేవుడిగా ఆరాధించడానికి నిరాకరించాడు. అతను విష్ణువును విశ్వసించడం మరియు పూజించడం కొనసాగించాడు .

ఇది హిరణ్యకశిపునికి కోపం తెప్పించి, ప్రహ్లాదుని చంపడానికి రకరకాల ప్రయత్నాలు చేశాడు. ప్రహ్లాదుని చంపడానికి ప్రయత్నించినప్పుడు, రాజు హిరణ్యకశిపు సోదరి హోలిక ఆమెకు సహాయం చేసింది.

విష్ణు పురాణం ప్రకారం , హోలిక తనకు లభించిన వరం కారణంగా, అగ్నికి అభేద్యమని తన సోదరుడికి చెప్పింది. మండుతున్న చితిపై ప్రహ్లాదుడిని తన అత్త ఒడిలో కూర్చోబెట్టడానికి ఏర్పాట్లు జరిగాయి. అయితే, ప్రహ్లాదుడు విష్ణు నామాన్ని జపించడంతో, హోలిక భస్మమైపోగా, అతను క్షేమంగా బయటపడ్డాడు “ అన్నాడు విక్రమార్కుడు.

అతనికి మౌనభగంకావడంతో శవంతోససహ మాయమైన బేతాళుడు మరలా చెట్టుపైకిచేరాడు.

పట్టువదలని విక్రమార్కుడు బేతాళునికై మరలా వెనుతిరిగాడు.

★★★★







# పుట్టినరోజు-పుస్తకం

ఆ రోజు రాహుల్ పుట్టినరోజు. రాహుల్ ముందు రోజే తన స్నేహితులందరినీ మరుసటి రోజు సాయంత్రం తన ఇంటికి రమ్మని కేక్ కట్ చేస్తానని పిలిచాడు. రాహుల్ ఇంటి పనిమనిషి కొడుకు రాము తనను పుట్టినరోజుకు తీసుకెళ్ళమని తన తల్లిని కోరుతాడు.

రాము అమ్మ “వద్దు అందరూ గొప్ప గొప్ప బహుమతులు తీసుకుని వస్తారు. మనం పేదవాళ్ళం . ఏమీ కొనలేము. నాకంటే తప్పదు పని ఉంటుంది వెళ్తాను” అంది. కానీ రాముకి వెళ్లాలని ఎంతో కోరిక ఏమి తీసుకెళ్లాలో అర్థం కావడం లేదు. తనకు గతంలో ఎప్పుడో పెద్ద బాలశిక్ష పుస్తకం స్కూల్ లో బహుమతి రావడంతో దానిని తీసుకెళ్లాడు. అందరూ రకరకాల ఖరీదైన బహుమతులు రాహుల్ కిచ్చి, తినడానికి వెళుతున్నారు.

రాము అమ్మ రాముని చూసి “వెళ్ళిపో” అంటూ సైగ చేస్తోంది. అది గమనించి రాహుల్

“ ఆ అబ్బాయి ఎవరు?” అని అడిగాడు.

“ మా బాబు రాము చినబాబు” అంది రాము అమ్మ భయం భయంగా.

రాహుల్ తనే రాము దగ్గరకొచ్చి రాము చేతిలో ఉన్న “పెద్దబాలశిక్ష” పుస్తకమును అందుకొని, రాముతో

“ ఎవరు ఎన్ని బహుమతులు ఇచ్చినా విరిగిపోతాయి. కానీ నీవు ఇచ్చిన ఈ బుక్కు జీవితాంతం ఉంటుంది. మంచి పని చేశావు. అంటూ రాముకి తిరిగి ఎన్నో బహుమతులు ఇచ్చి తన గొప్ప మనసు చాటుకున్నాడు. వచ్చిన వారందరూ రాహుల్ ని ఎంతో పొగిడారు.

రాము ఎంతో సంతోషంతో తల్లి వంక చూశాడు.

# చూపించాల్సిన సినిమా

ఇవాల్టి రోజున ఎటువంటి సినిమాలు వస్తున్నాయో అందరికి తెలిసిందే , వాటి వాటిని చూసి పిల్లలు ఏమి నేర్చుకుంటున్నారో కూడా అందరికి తెలుసు . సినిమా చెడ్డది కాదు .మంచి సినిమా పిల్లలకు చూపిస్తే దానివల్ల ఎంతో ప్రయోజనం కుడా ఉంటుంది . అందుకే ఇక్కడ మంచి సినిమాలను పరిచయం చేస్తున్నాము .



లిటిల్ సోల్జర్స్, 1996లో విడుదలైన ఒక తెలుగు సినిమా. అప్పుడు వస్తున్న మూస చిత్రాలకు భిన్నంగా చిన్నపిల్లలతో ప్రయోగాత్మకంగా తీసిన ఈ సినిమా మంచి విజయాన్ని సాధించింది. క్రైమ్, సస్పెన్స్‌లతో హాస్యాన్ని జోడించడం వలన సినిమా సాఫీగా సాగిపోతుంది.

అరవింద్ (రమేష్ అరవింద్), అనిత (హీరా) తల్లిదండ్రుల అనుమతిలేకుండా ప్రేమ వివాహం చేసుకుంటారు. వారికి ఇద్దరు పిల్లలు. సన్నీ (ఇప్పటి బాలాదిత్య అయిన మాస్టర్ ఆదిత్య), బన్నీ (బేబీ కావ్య). అనిత తల్లి రాజరాజేశ్వరి (రోహిణీ హట్టంగడి) గొప్ప ధనవంతురాలు. ఆమె ఆస్తిమీద కన్ను వేసిన అనిత మేనమామ శేషాద్రి (గిరిబాబు), అతని కొడుకు(సుధాకర్) ఒక ప్రమాదంలో అనిత, అరవింద్‌లు చనిపోయేలా చేస్తాడు. అయితే అదృష్టవశాత్తూ సన్నీ, బన్నీ ఆ ప్రమాదంనుండి తప్పించుకొని తాత (తండ్రికి తండ్రి) అయిన హరిశ్చంద్ర ప్రసాద్ (కోట శ్రీనివాసరావు) దగ్గఱకు చేరుతారు. శేషాద్రి వారిని చంపించే ప్రయత్నాలు కొనసాగిస్తాడు. ఆ పిల్లలు అనేక విపత్తులనుండి బయటపడి తాత, అమ్మమ్మల మనసులు మార్చడం సినిమా కథాంశం.

ఈ సినిమాని గున్నం గంగా రాజు తన స్వియ దర్శకత్వం లో నిర్మించారు. ఈ చిత్రానికి సంగీతదర్శకుడు శ్రీ కొమ్మినేని స్వరాలు సమకుర్చరు.



★★★



# వండర్ కిడ్స్

చిన్న వయసులో పిల్లలు చెప్పిన మాట వినకపోవడం, అల్లరి చేయడం చేయడం వంటివి సాధారణంగా చూస్తుంటాం,మరి కొంత మంది పిల్లలు అయితే ఇల్లు పీకి పందిరి వేస్తారు. ముఖ్యంగా ఈరోజుల్లో పిల్లలు అయితే ఫోన్ పట్టి రీల్స్ చూడటం, టీవీ చూస్తూ కాలక్షేపం చేస్తుంటారు. మరి పిల్లలు కదా అంత చిన్న వయసులో ఇంకా ఏం చేయగలరని అనుకుంటే మాత్రం పొరపాటు పడ్డట్టే. ఎందుకంటే ఒకటి కాదు రెండు కాదు సుమారు 300 వందల ప్రశ్నలకు చక చక సమాధానం చెపుతూ అబ్బురపరుస్తున్నాడు ఓ బుడతడు. అంతే కాదు కేవలం 8 నిమిషాల్లో సమాధానాలు పూర్తిచేసి ఇంటర్నేషనల్ వండర్ బుక్ ఆఫ్ రికార్డ్స్ లో చోటు దక్కించుకున్నాడు. మంచిర్యాల జిల్లా హైటెక్ సిటీ ప్రాంతానికి చెందిన నామాని రామ్ అక్షరేష్ ప్రస్తుతం 4 ఏళ్ల వయసులో వండర్ కిడ్గా మారి అందరి ప్రశంసలు అందుకుంటున్నాడు.

సూపర్ కిడ్..

మంచిర్యాల జిల్లా హైటెక్ సిటీ ప్రాంతానికి చెందిన నామాని రమేష్ మౌనిక దంపతులకు ఇద్దరు సంతాన పాప,(10) బాబు (4)నామాని రామ్ అక్షరేష్,తల్లి మౌనిక ఆన్లైన్ లో యోగా క్లాసులు నిర్వహిస్తుంది. తండ్రి వ్యాపారం చేస్తుంటాడు. తమ పిల్లలకు చిన్న వయసు నుండే సరైన మార్గంలో నడిపించాలనే ఉద్దేశంతో వారికి ప్రత్యేకంగా సమయాన్ని కేటాయించి పిల్లలకి విజ్ఞానం పెంపొందించే దిశగా పాలు రకాల అంశాలను నేర్పించడం తో వారు మరింత ఉత్సాహం తో నేర్చుకుని అవార్డులను సైతం సొంతం చేసుకుంటున్నారు.

★★★



# అభిమన్యుడు

మహాభారతంలోని ఎనిమిదవ పర్వమైన ద్రోణ పర్వలోని "అభిమన్యు-బాధ పర్వం" అంతటా అభిమన్యుని మరణం గురించి వివరంగా వివరించబడింది.

పదకొండవ రోజున భీష్ముడు ఓడిపోయిన తర్వాత, గతంలో పాండవులు, కౌరవుల గురువుగా ఉండే ద్రోణుడు--కౌరవ పక్షానికి కొత్త నాయకుడిగా ఎంపికయ్యాడు. పన్నెండవ రోజు పేలవమైన ప్రదర్శన తరువాత, దుర్యోధనుడు అతనిని మందలించాడు. పాండవులను ఓడించాలనే ప్రతిజ్ఞను అతనికి గుర్తు చేశాడు.


ద్రోణుడు ఇబ్బందిగా భావించి చక్రవ్యూహం ప్రారంభించాలని నిర్ణయించుకున్నాడు. అర్జునుడు చక్రవ్యూహ రక్షణలో నిపుణుడు కాబట్టి, అర్జునుడిని అక్కడి నుంచి వేరొక చోటికి మళ్లించమని దుర్యోధనుడిని అభ్యర్థించాడు.

పదమూడవ రోజున, అర్జునుడు సంసప్తకులచే దక్షిణ దిక్కుగా తిరిగాడు. ద్రోణాచార్యుని నేతృత్వంలోని కౌరవుల సైన్యం చక్రవ్యూహ శ్రేణిలో తమను తాము ఏర్పాటు చేసుకుంది. ద్రోణుడు, కర్ణుడు, శల్యుడు, కృపాచార్యుడు, అశ్వత్థామ, దుర్యోధనుడు, జయద్రథుడు, దుఃశ్శాసనుడు, భూరిశ్రవుడు వంటి మహారథులు లక్షలాది మంది సైనికులచే కాపలాగా ఉన్న ఆ నిర్మాణపు రేకులను ఏర్పరిచారు. పాండవ దళాలు యుద్ధంలో పాల్గొనడానికి ముందుకు సాగాయి, కాని ద్రోణుని ప్రాణాంతక బాణాల వల్ల అందరూ వెనక్కి తగ్గారు. చక్రవ్యూహంలో ప్రవేశించగల కొద్దిమంది వ్యక్తులలో ఒకరిగా, అభిమన్యునికి యుధిష్ఠిరుడు ఆ పనిని అప్పగించాడు. ఎలా తప్పించుకోవాలో తనకు తెలియదని అభిమన్యుడు యుధిష్ఠిరుడికి గుర్తు చేసాడు, కానీ ఏదైనా తప్పు జరిగితే సహాయం చేయడానికి ప్రజలు అతనిని అనుసరిస్తున్నారని యుధిష్ఠిరుడు అతనిని ఒప్పించాడు

అభిమన్యుడు తన రథసారధి అయిన సుమిత్రను ద్రోణుడి వద్దకు వెళ్లమని ఆజ్ఞాపించగా, పాండవులు అతని వెనుకకు వెళ్ళారు.

కౌరవ సైనికులు అభిమన్యునిపై దాడి చేశారు, కానీ అతను వారి బలీయమైన రక్షణను కత్తిరించి దానిని ముక్కలు చేశాడు. అప్పుడు బలీయమైన కౌరవ యోధులు అతనికి సవాలు విసిరారు. వేర్వేరు యుద్ధాలలో అభిమన్యుడు దుర్యోధనుడు, దుశ్శాసనుడు, ద్రోణుడు, అశ్వథామ, కర్ణుడు, శకునిలను ఓడించాడు. అతను అస్మాక రాజు కుమారుడు, శల్య సోదరులు, రుక్మరథుడు, లక్ష్మణుడు, బృందాక,

# ధారావాహిక



జయత్సేనుడి కుమారుడు బృహత్బల, అశ్వకేతువు, భోజ యువరాజు మార్తికావతతో సహా అనేక మంది శత్రు యోధులను కూడా వధించాడు.

దుర్యోధనుడు, తన కుమారుని హత్యతో కోపోద్రిక్తుడై, అభిమన్యుని హత్య చేయడానికి అసలు ప్రణాళికను మార్చమని ద్రోణుడికి సూచించాడు.


పాండవుల దళాలను జయద్రథుడు అడ్డుకున్నాడు, చివరికి నలుగురినీ ఓడించి, అభిమన్యుని ఒంటరిగా విడిచిపెట్టాడు. దుర్యోధనుడి అపఖ్యాతి పాలైన మేనమామ శకుని, యుద్ధ నియమాలను ఉల్లంఘించిన అతనిపై ఏకకాలంలో దాడి చేయడానికి ఒక వ్యూహాన్ని రూపొందించాడు. ద్రోణుడు, కర్ణుడు, కృపాచార్యుడు, కృతవర్మ, అశ్వత్థామ, శకుని అనే ఆరుగురు మహారథులు అభిమన్యునిపై దాడి చేశారు.

వారు అతని రథాన్ని పడగొట్టారు, అతని రథంలోని గుర్రాలను చంపారు, అతని ఆయుధాలను విరగ్గొట్టారు. అనేక బాణాలతో అతనిని కొట్టారు. అభిమన్యుడు చాలా మంది గాంధార సైనికులను హతమార్చి, ఈ సమయంలో అలసిపోయినప్పటికీ, నిస్సహాయంగా ఉన్నప్పటికీ రథచక్రాన్ని ఉపయోగించి యుద్ధం కొనసాగించాడు. దుశ్శాసనుడి కొడుకు తలపై తగిలిన దెబ్బ చివరికి అతనికి రక్తస్రావం అయి మరణించాడు

అభిమన్యుడు పూర్వజన్మలో చంద్రుని కుమారుడు వర్చస్సు అని పురాణాలు చెబుతాయి. దేవతల సమావేశంలో, దుష్టులను శిక్షించడానికి విష్ణుమూర్తి కృష్ణుడిగా అవతరిస్తున్నాడని, దేవతలు కూడా తమ అంశలతో మానవులుగా అవతరించి మహాభారత యుద్ధంలో పాల్గొనాలని నిర్ణయించుకున్నారు.

అప్పుడు చంద్రుడు తన కుమారుడు వర్చస్సును భూలోకంలో అభిమన్యుడిగా జన్మించమని అంగీకరించాడు. కానీ, తన కొడుకును చూడలేక బాధపడటం ఇష్టం లేక, అతను భూలోకంలో కేవలం 16 ఏళ్లు మాత్రమే ఉంటాడనే షరతు విధించాడు. అందుకే అభిమన్యుడు అల్పాయుష్కుడిగా జీవించవలసి వచ్చింది వర్చస్సు అంటే తెలుగులో 'తేజస్సు' అని అర్థం. చంద్రుని కుమారుడు కాబట్టి, అతను అత్యంత తేజస్వీగా ఉంటాడుఅభిమన్యుడు కురుక్షేత్ర యుద్ధంలో వీరమరణం పొందిన తర్వాత తిరిగి స్వర్గానికి వెళ్లి, వర్చస్సుగా మారిపోయాడు.

వచ్చే నెల మరో వీరుడి కథ తో కలుద్దాం ...







# శివాజీ

ఇది సహించలేని బిజాపూర్ సుల్తాన్ అరబ్, పర్షియా, ఆఫ్ఘన్ నుండి మెరికల్లాంటి 10,000 మంది కిరాయి సైనికులను శివాజీని అంతమొందించడానికి పంపగా శివాజీ తన వద్దనున్న 5,000 మరాఠా యోధులతో కలసి కొల్హాపూర్ వద్ద ఎదుర్కొన్నాడు. 'హర హర మహాదేవ ' అంటూ శివాజీ యుద్ధరంగంలో విజృంభించి శతృవులను ఊచకోత కోశాడు. ఈ విజయంతో కేవలం సుల్తానులే కాక మొఘల్ చక్రవర్తి అయిన ఔరంగజేబుకు సైతం శివాజీ అంటే భయం పుట్టింది. శివాజీ నుండి ఎప్పటికయినా తనకు ముప్పు తప్పదని ఔరంగజేబు భావించి సన్నాహాలు మొదలు పెట్టాడు. తన మేన మామ షాయిస్త ఖాన్ ను శివాజీ పై యుద్ధానికి

పంపాడు. రెండుసార్లు పరాజయాన్ని ఎదుర్కొన్న అదిల్షా మూడవసారి సిద్ది జోహార్ అనే పేరు పొందిన సైన్యాధ్యక్షుడికి అపారమయిన సైనిక, ఆయుధ బలగాలు అందించి కొల్హాపూర్ పంపించాడు. ఆ సమయంలో కొల్హాపూర్ దగ్గరలో ఉన్న పన్హాలా కోటలో శివాజీ కొన్ని వందలమంది అనుచరులతో ఉన్నాడు. సిద్ది జోహార్ విషయం తెలుసుకొన్న శివాజీ ఎలాగయినా పన్హాలా కోట నుండి తప్పించుకొని తన సైన్యం మొత్తం ఉన్న విశాల్‌ఘడ్ కోటకు చేరుకొంటే యుద్ధం చేయవచ్చు అనుకున్నాడు. కానీ అప్పటికే పన్హాలా కోట చుట్టూ శత్రుసైన్యం ఉండడంతో తాను యుద్ధానికి సిద్ధంగా లేనని దయతలచవలసినదిగా సిద్ది జోహార్‌కు వర్తమానం పంపాడు. అది తెలుసుకొన్న సిద్ది జోహార్ సైనికులు నిఘా సరళం చేసి విశ్రాంతి తీసుకొంటుంటే, శివాజీ తన అనుచరులతో కోట నుండి తప్పించుకొని తన సైన్యం ఉన్న కోటవైపు పయనించసాగాడు. చివరిక్షణంలో ఇది తెలుసుకొన్న సిద్ది జోహార్ తన బలగాలతో శివాజీని వెంబడించసాగాడు.

కోటకు చేరుకొనేలోపు శత్రువులు తమను సమీపించగలరు అన్ని విషయం గ్రహించి బాజీ ప్రభు దేశ్‌పాండే అనే సర్దార్ 300 మంది అనుచరులతో కలసి తాము శత్రుసైన్యాన్ని ఎదుర్కొంటామని, శివాజీని తన అంగరక్షకులతో ఎలాగయినా కోట చేరుకోమని చెప్పి ఒప్పించాడు. శివాజీ కోట వైపు వెళ్ళిన వెంటనే బాజీ ప్రభు దేశ్‌పాండే రెండు చేతులా ఖడ్గాలు పట్టుకొని శత్రువులతో యుద్ధం చేశాడు.

300 మంది సైనికులు తమ ప్రాణాలకు తెగించి అతి బలమయిన శత్రువులతో పోరాడి నేలకొరిగారు.

# ధారావాహిక

అప్పటికి శివాజీ తన కోట చేరుకున్నాడు. కోటలో తన అనుచరులతో చర్చించిన అనంతరం తాము సిద్ది జోహార్ సైన్యాన్ని ఎదుర్కొనలేమని గ్రహించిన శివాజీ సంధికి అంగీకరించాడు. సంధిలో భాగంగా శివాజీ సామ్రాజ్యం స్వతంత్ర రాజ్యంగా గుర్తింపు పొందింది. సిద్ది జోహార్ విజయానికి బహుమతిగా పన్హాలా కోట లభించింది.ఈ యుద్ధమే సుల్తానులతో శివాజీ చేసిన ఆఖరి యుద్ధం. ఆ తరువాతి కాలంలో మొఘల్ సైన్యంతో యుద్ధాలు చేయవలసి వచ్చింది.



1660లో ఔరంగజేబు తన మేనమామ అయిన షాయిస్తా ఖాన్‌కు లక్షకు పైగా సుశిక్షుతులయిన సైన్యాన్ని, ఆయుధాలను అందించి శివాజీని ఓడించి దక్కన్ ప్రాంతాన్ని స్వాధీనం చేసుకొని రమ్మని పంపించాడు. బలమయిన షాయిస్తా ఖాన్ సేన ముందు శివాజీ సేన తల వంచక తప్పలేదు. శివాజీ ఓటమి అంగీకరించి పూణే వదిలి వెళ్ళవలసి వచ్చింది. పూణేలో శివాజీ నిర్మించిన లాల్ మహల్‌లో షాయిస్తా ఖాన్ నివాసం ఏర్పరుచుకొన్నాడు.

ఎప్పటికయినా శివాజీ మెరుపుదాడి చేస్తాడని షాయిస్తా ఖాన్ పూణే నగరమంతా చాలా కట్టుదిట్టమయిన భద్రతను ఏర్పాటు చేసాడు. 1663 ఏప్రిల్లో నగరంలో ఒక పెళ్ళి ఊరేగింపు జరుగుతుండగా శివాజీ మారువేషంలో తన అనుచరులతో కలసి పెళ్ళికూతురు తరపున బంధువుల్లో కలసిపోయి లాల్ మహల్ చేరుకొన్నాడు. ఆ భవనం స్వయానా తన పర్యవేక్షణలో నిర్మించబడింది.కాబట్టి, సులువుగా లోపలికి చేరుకొని షాయిస్తా ఖాన్ గదిలోకి చేరుకొన్నాడు. శివాజీ కత్తివేటుకు షాయిస్తా ఖాన్ మూడువేళ్ళు తెగి కింద పడగా, షాయిస్తా ఖాన్ కిటికీలో నుండి దుమికి ప్రాణాలు రక్షించుకున్నాడు. అంతలో ఇది పసిగట్టిన షైస్తా ఖాన్ అంగరక్షకులు షాయిస్తా ఖాన్‌ను సురక్షిత ప్రాంతానికి తీసుకెళ్ళారు. మొఘలులకు మచ్చ తెచ్చిన షాయిస్తా ఖాన్‌ను ఔరంగజేబు సుదూర బెంగాలీ ప్రాంతానికి పంపించివేసాడు.

1664 నాటికి సూరత్ నగరం ప్రధాన వ్యాపారకేంద్రంగా ఉండేది. శివాజీ సూరత్ పైన దాడి చేసి ధనాన్ని, ఆయుధాలను దోచుకున్నాడు. అపారమయిన ఆ మొఘల్ సంపదతో కొన్ని వేలమందిని తన సైన్యంలో చేర్చుకొన్నాడు. కొద్దిరోజుల్లో మొఘలుల, బీజాపూర్ సుల్తానుల కోటలను ఒక్కొక్కటిగా తన సొంతం చేసుకోవడం మొదలు పెట్టాడు.

ఇది చూసిన ఔరంగజేబు ఆగ్రహోద్రుడై తన దగ్గర పనిచేస్తున్న రాజపుత్రుడయిన రాజా జై సింగ్‌ను శివాజీ పైకి పంపించాడు.రాజా జై సింగ్ గొప్ప రాజ నీతిజ్ఞుడు.రాజా జై సింగ్ అద్వర్యంలో మొఘల్ సేనలు మొదట పురంధర్ దుర్గాన్ని ఆక్రమించాయి. తర్వాత రాయఘుర్ ఆక్రమనకై సేనలు ముందుకు సాగుతుండగా ఓటమి గ్రహించిన శివాజీ రాజ జై సింగ్ తో సంధికి దిగాడు .1665 లో శిబాజి రాజా జై సింగ్ తో పురంధర్ వద్ద సంధి చేసుకున్నాడు .తర్వాత కూడాను కూడా ఒక మొఘల్ సర్దార్‌గా ఉండడానికి అంగీకరించాడు. మొఘల్ సైన్యాన్ని ఉపయోగించుకొని తన శత్రువులయిన బిజాపూర్, గోల్కొండ సుల్తానులను ఓడించడానికే శివాజీ మొఘల్ సర్దార్‌గా ఉండడానికి ఒప్పుకున్నాడు.

(ఇంకా ఉంది )

# ఉపాధ్యాయులకు



## తరగతి గదే ఒక ప్రయోగశాల

మీలో  చాల మంది చక్కగా ప్రయోగ శాలలో  సైన్సు ప్రయోగాలను విద్యార్ధులకు సులభంగా వివరిస్తూ ఉంటారు . వాటిని అక్షరబద్ధం చెయ్యండి . ఒకటి రెండు బొమ్మలు( ఫోటో తీసి ) కలిపి మాకు పమపండి .ఉత్తమమైన ప్రయోగాన్ని ప్రచురించటమే కాక బహుమతి కూడా గెలుచుకొండి .

మీ పేరు :

పాఠశాల చిరునామా :

ప్రయోగం పేరు :

ప్రయోగం వివరణ :

ప్రయోగం బొమ్మలు :



చివరగా ప్రయోగం మీ సొంతమని హామీ పత్రం తప్పనిసరి . ఎదో ఒక బొమ్మలో మీరు ఉండేటట్లు చుడండి .

మీలో  చాల మంది చక్కగా ప్రయోగ శాలలో  సైన్సు ప్రయోగాలను విద్యార్ధులకు సులభంగా వివరిస్తూ ఉంటారు .మీరు కనుక మీ పాఠశాలలో సైన్సు ఎక్సిబిషన్ నిర్వహించే ఉద్దేశ్యం ఉంటె మాకు తెలియ చెయ్యండి . మీకు ప్రోత్సాహం ఇవ్వటమే కాకుండా , మీ ప్రదర్శనకు సంబంధించిన వార్తలను ఫోటోలతో  ఉచితంగా పత్రికలో ప్రచురిస్తాము .

మీ విద్యార్ధులకు  ఆధునిక సాంకేతిక అంశాలపై అవగాహనా లేదా ?అటువంటి కార్యక్రమం నిర్వహించాలని అనుకుంటున్నారా ? అయితే మాకు రాయండి , కృత్రిమ మేధ, రాకెట్ ప్రయోగాలు , బయోటెక్నాలజీ ..ఇలా వివధ రంగాలలో నిష్ణాతులైన వారిచే ఉచితంగా అవగాహనా కార్యక్రమం నిర్వహిస్తాము .పూర్తిగా ఉచితం ..ఎటువంటి  రుసుము అవసరం లేదు .



నీటి గడియారం ఎలా తయారు చేయాలి

పురాతన ప్రజలకు నేడున్నట్లుగా గడియారాలు ఉండేవని, అతను ఆశ్చర్యపోయాడు. బ్యాటరీలు లేదా విద్యుత్ లేకుండా గడియారంలోని ముళ్ళు కదలలేవని అతనికి ఎప్పుడూ ఆలోచన వచ్చి ఉండదని నేను అనుకుంటున్నాను.

ప్రాచీన గ్రీస్‌లో, వారు చిన్న సంఘటనలను సమయపాలన చేయడానికి నీటి గడియారాన్ని ఉపయోగించారు. దీనిని క్లెప్సిడ్రా (KLEP-sye-druh) అని పిలిచేవారు. ఈ పురాతన గడియారాల యొక్క మా స్వంత వెర్షన్‌ను తయారు చేయడం సరదాగా ఉంటుందని నేను అనుకున్నాను.

కావాల్సింది ఏంటి

మాస్కింగ్ టేప్,ఫైన్-టిప్ శాశ్వత మార్కర్,ఒకేలాంటి రెండు ఖాళీ ప్లాస్టిక్ పానీయాల సీసాలు,బొటనవేలు తాకడం,నీటి కుండ,టైమర్ (స్టాప్‌వాచ్ యాప్),క్రాఫ్ట్ కత్తి (పెద్దలు మాత్రమే ఉపయోగించాలి), గరాటు

దీన్ని ఎలా తయారు చేయాలి


లోపలి భాగాన్ని స్పష్టంగా చూడటానికి పానీయాల సీసాల నుండి లేబుల్‌లను తీసివేయండి. ఒక వయోజన వ్యక్తి క్రాఫ్ట్ కత్తితో బాటిల్ పైభాగాలలో ఒకదాన్ని కత్తిరించాలి. పైభాగాన్ని రీసైకిల్ చేయండి; మీకు అది అవసరం ఉండదు. పైభాగాన్ని కత్తిరించిన తర్వాత, మరొక బాటిల్ అడుగు భాగం దానిలోకి చక్కగా సరిపోతుంది. మీకు కావాలంటే బాటిళ్లను లేబుల్ చేయండి (బాటిల్ A అనేది పూర్తి బాటిల్ మరియు బాటిల్ B అనేది మీరు కత్తిరించినది). పూర్తి బాటిల్‌ను తిప్పండి (బాటిల్ A) మరియు బాటిల్ అడుగు మధ్యలో ఒక చిన్న రంధ్రం చేయడానికి బొటనవేలు బిగింపును ఉంచండి. ఈ సీసాపై పూర్తి గీత ఎక్కడ ఉందో గుర్తించండి (సీసా B లోపల సీసా A ని గూడు కట్టడం ద్వారా దీన్ని గుర్తించండి; సీసా B దిగువ నుండి సీసా A దిగువ వరకు లేదా కొంచెం దిగువన మీరు సీసా A పై గీతను గీయాలి). గమనిక: మేము దీన్ని తప్పుగా అర్థం చేసుకున్నాము కానీ ప్రతిసారీ మీ సీసాను ఎంత నింపాలో తెలుసుకోవడం ముఖ్యం. మీరు స్థిరంగా ఉండాలి.మాస్కింగ్ టేప్ పొడవు తీసుకొని దానిని కట్ బాటిల్ (బాటిల్ B) వైపు నిలువుగా అతికించండి. ఇప్పుడు మీ టైమర్ మరియు నీటి కుండను సిద్ధం చేసుకోండి. కావాలనుకుంటే గరాటు ఉపయోగించి, బాటిల్ A మెడలోకి నీటిని పోయాలి (మీ బాటిళ్లను గూడుగా ఉంచాలి) మరియు వెంటనే


# ప్రయోగశాల


టైమర్‌ను ప్రారంభించండి. బాటిల్ A పై ఫిల్ లైన్ వరకు పోయాలి. ఒక నిమిషం గడిచిన తర్వాత, బాటిల్ B పై ఉన్న మాస్కింగ్ టేప్ పై నీటి లైన్ వద్ద ఒక చిన్న గుర్తును వేయండి. పై బాటిల్ నుండి నీరు పూర్తిగా కింది బాటిల్ లోకి ఖాళీ అయ్యే వరకు నిమిషాలను గుర్తు పెట్టడం కొనసాగించండి. మేము మొదటి 10 నిమిషాలు మాత్రమే మార్క్ చేసాము, కానీ మీరు మీకు కావలసినన్ని నిమిషాలను మార్క్ చేయవచ్చు. ఇప్పుడు మీరు నీటిని బయటకు పంపించి టైమర్‌ను పక్కన పెట్టవచ్చు. మళ్ళీ జగ్ పోయాలి, మీ నీటి గడియారంతో ఏదైనా పని చేయడానికి ఎంత సమయం పడుతుందో మీరు లెక్కించవచ్చు!







# బొమ్మకు కథ

ఈ క్రింది బొమ్మకు కథ రాసి పంపండి ఉత్తమమైన కథకు రూ 116 /-బహుమతి పొందండి నిబంధనలు :పది సంవత్సరాల పిల్లలకు మాత్రమే ,కథ కనీసం ప్రింటులో ఒక పేజి రావాలి కథ యుని కోడ్ లో టైపు చేసి పంపాలి ,చేతి రాత కథలు స్వీకరించబడవు పంపవలసిన చిరునామా sumathibalapatrika@gmail.com ఆఖరు తేది :15-02-2026



## బొమ్మలు వేసి పంపండి

### అంశం : ట్రాఫ్ఫిక్ రూల్స్

నిబంధనలు :పది సంవత్సరాల పిల్లలకు మాత్రమే ,A4 సైజు పపెర్ మీద గీసి ఫోటో తీసి పంపండి

తల్లి తండ్రులు , ఉపాధ్యాయులు పిల్లలను పోటిలకు ప్రోత్సహించండి .పోటిలో గెలిచిన వారి ఫోటతో పాటు వారి తల్లి తండ్రుల , ఉపాద్యాయుల వివరాలు కుడా ప్రచురిస్తాము

పంపవలసిన చిరునామా

sumathibalapatrika@gmail.com

ఆఖరు తేది :15-02-2026

## పజిల్:

మూడు సింహాలు , మూడు మేకలు ఒక నది ఒడ్డున ఉన్నాయి .వాటిని పడవ ద్వారా నది అవతలి ఒడ్డుకు చేర్చాలి .

నియమాలు :1. మేకలకంటే సింహాలు ఎక్కువ ఉంటె సింహాలు మేకల్ని తింటాయి

2. పడవలో ముగ్గురు మాత్రమే ప్రయాణించవచ్చు

వివరంగా మీ సమాధానం రాయండి .ఉత్తమ సమాధానానికి 116/- బహుమతి పొందండి .


ఆఖరు తేది :15-02-2026


# బొమ్మల కథ



## అల్లాఉద్దీన్ అద్భుత దీపం


గుహ లోపల
అల్లావుద్దీన్ కు
ఒక తివాచీ
ఒక దీపం
కనపడ్డాయి





ఆ దీపాన్ని తీసుకుని
దాని మీద వున్న దుమ్ము
పోగొట్టడానికి గట్టిగా
రుద్దాడు

# బొమ్మల కథ



ఆ దీపం లోపల నుండి ఓ భూతం బయటకు వచ్చింది,దాని పేరు జినీ



ఆ భూతం అల్లావుద్దీన్ కు మూడు వరాలు ఇచ్చి కావలసినవి కోరుకోమంది





భూతం ఇచ్చిన వరంతో అల్లావుద్దీన్ ధనవంతుడిగా మారిపోయాడు
జాస్మిన్ ని తీసుకుని తివాచీ మీద విహరించ సాగాడు

దానితో జాఫర్ కి కోపం వచ్చి అల్లావుద్దీన్ ని సముద్రంలోకి విసిరేశాడు
జినీ వచ్చి అల్లావుద్దీన్ ని రక్షించాడు



# తేడాలు కనిపెట్టండి




# తప్పులు కనిపెట్టండి ..



# కనుక్కోండిచూద్దాం

ఎలుక ఆహారాన్ని చేరుకోటానికి సాయం చెయ్యండి



# రంగులు వేయండి





